నేటి దినపత్రిక
# సూర్య
ఆదివారం
10 డిసెంబరు
2023
పేజీలు 12
ప్రకాశం
బాపట్ల

## రాజకీయాలను చూస్తుంటే
# ఇరిటేషన్ వస్తోంది

**మీరంతా పని చేస్తానంటేనే పోటీ చేస్తా - నా కొడుకుకి జగన్ అంటే ఇష్టం**
**తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని పందెం వేశా.. కొడుకు కోసం క్యాన్సిల్ చేశా**
**నేను నీతిమంతుడిని, డబ్బులు తీసుకోలేదని చెప్పను**
**ఈసారి ఎన్నికల్లో కులం రోడ్డుపైకి వచ్చి పని చేస్తుంది**
**సినిమా ఆడియో ఫంక్షన్‌లో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని సంచలన వ్యాఖ్యలు**

రాజకీయలను చూస్తుంటే ఇరిటేషన్ వస్తుంది.. అందరి మద్దతు ఉంటేనే పోటీ చేస్తా.. ఈసారి ఎన్నికల్లో కులం రోడ్డుపైకి వచ్చి పని చేస్తుంది.. నా కుమారుడికి జగన్ అంటే ఎంతో ఇష్టం.. నేను కాంగ్రెస్ గెలుస్తుందని అంటే వాడు బిఆర్ఎస్ వస్తుందన్నాడు... ఎందుకంటే బిఆర్ఎస్ గెలిస్తే వైసిపి గెలుస్తుందని వేసిన పందెం కూడా వెనక్కు తీసుకున్నా.. నేను నీతిమంతుడిని.. ఎక్కడా డబ్బులు తీసుకోలేదని చెప్పను.. కానీ ఎలాంటి తప్పులు చేయలేదు.. మీరందరూ నా కోసం పని చేస్తానంటేనే పోటీ చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు ఉమ్మడి ప్రకాశంలో చర్చనీయాంశంగా మారింది.

సూర్యప్రతినిధి, ఒంగోలు



ఒంగోలులో జరిగిన ఓ సినిమా ఆడియో ఫంక్షన్‌లో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఆయన మాట్లాడుతూ నేను రాజకీయాలకు రాక ముందు సినిమాలు తీయాలను కున్నా, అందుకోసం చెన్నై వెళ్లాను. అయితే సినిమా తీయడం అలస్యమైంది. ఆ కోరిక ఉంది కచ్చితంగా సినిమా తీస్తానన్నారు. చిన్న సినిమా అయితే ఎప్పుడో తీసేవాడ్ని పెద్ద హీరోతో సినిమా చేస్తానని పేర్కొన్నారు. రాజకీయాల విషయానికి మిగతా 3లో

# జగన్ పాలనకు అనర్హుడు

ఒంగోలు, మద్దిపాడు, మేజర్ న్యూస్ : గుండ్లకమ్మ గేటు పెట్టలేని అసమర్థ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఉమ్మడి ప్రకాశం తెలుగుదేశం శాసన సభ్యులు, ఇన్‌చార్జ్‌లు ధ్వజమెత్తారు. పాలకుల నిర్లక్ష్యంతోనే నేడు గుండ్లకమ్మ ప్రాజెక్టులో మరో గేటు కొట్టుకు పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, రైతులు భద్రత, సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. శనివారం మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టులను అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవి కుమార్, కొండేపి శాసన సభ్యులు డాక్టర్ డోల బాలవీరాంజనేయస్వామి, ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జ్ బీఎన్ విజయ కుమార్, గిద్దలూరు ఇన్‌చార్జ్ అశోక్ రెడ్డి, జనసేన నాయకులు బాబు, ముఖ్య నేతలు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిర్వహణ తీరు సక్రమంగా లేదని రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల భద్రతపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రాజెక్టుల భద్రత ఆందోళన కలిగిస్తుందని జగన్ రెడ్డికి పాలించే అర్హత లేదని అన్నారు. ప్రకాశం జిల్లాలో కీలకమైన ఈ ప్రాజెక్టుపై జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం మిగతా 3లో



**ప్రాజెక్టు గేటు పెట్టలేని సీఎం ఎందుకు?**
**వరద ప్రవాహంతో కొట్టుకుపోయిన మరో గేటు**
**గతేడాది కొట్టకపోయిన గేటుకే నేటికీ దిక్కులేదు**
**గుండ్లకమ్మ ప్రాజెక్టు భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం**
**రైతులు, ప్రజల భద్రత, సంక్షేమాన్ని విస్మరించిన పాలకులు**
**మిచౌంగ్ తుపాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి**
**నిర్లక్ష్యం చేస్తే రైతన్నకు అండగా ఉద్యమిస్తాం**
**గుండ్లకమ్మ ప్రాజెక్టును పరిశీలించిన టిడిపి ఎమ్మెల్యేలు గొట్టిపాటి, స్వామి, ఇన్‌చార్జ్ బీఎన్, ముత్తుముల, జనసేన నాయకులు**





రైతు శ్రీనివాసరావుకు రూ.2 లక్షల సాయం ప్రకటించిన చంద్రబాబు

**కాలువల్లో పూడికతీసి ఉంటే నష్టం జరిగేది కాదు**
**రోడ్లు బాగోలేవు కాబట్టే సీఎం హెలికాప్టర్‌లో ప్రయాణం**
**రాష్ట్రాభివృద్ధి కుంటుపడితే జీవితాలు బాగుపడేదెలా?**
**ప్రాజెక్టుల్లో గేట్లు మరమ్మతులు చేయలేని సీఎం రాజధాని కడతారా!**
**రైతుల ఆత్మహత్యలకు కారణం సీఎం జగన్మోహన్‌రెడ్డి**
**పర్చూరు బహిరంగ సభలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు**

# గాల్లో ఎగురుతూ.. గాలికొదిలేశారు?!

పర్చూరు, మేజర్‌న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గాల్లో తిరిగుతూ రైతుల సమస్యలను గాలికి వదిలేసి వెళ్లిపోయారని తెదేపా అధినేతన నారా చంద్రబాబు నాయుడు దుయ్యబట్టారు. పర్చూరు మండలం చెరుకూరులో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి అధ్యక్షతన చంద్రబాబు బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడిక తీసినట్లైతే రైతులకు నష్టం ఉండేది కాదని, రైతుల ఆత్మహత్యలకు కారణం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. రహదారులు బాగాలేదు కాబట్టే ముఖ్యమంత్రి హెలికాప్టర్లో తిరుగుతున్నాడని ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధి కుంటుపడితే జీవితాలు ఎలా బాగుపడతాయని, ప్రాజెక్టులో గేట్లు మరమ్మతులు చేయలేని ముఖ్యమంత్రి రాజధాని కడతారా అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తూ ముఖ్యమంత్రి బతికిపోవాలనుకుంటున్నాడన్నారు. పంటలు నష్టపోతే విత్తనాలు ఇవ్వలేని ప్రభుత్వం మనకు అవసరమా, ఎన్నికలప్పుడు ముద్దులు పెట్టి తర్వాత పిడుగుద్దుల్లో జగన్మోహన్ రెడ్డి దిట్ట అన్నారు.





ప్రభుత్వ వైఫల్యం మిగతా 7లో

## గెలిచే వారికే టిక్కెట్ ఇస్తా



**రాష్ట్ర ప్రజలకు తెదేపా అవసరం ఎంతో ఉంది**
**నాయకుల పనితీరు బాగోకుంటే ఉపేక్షించను**
**ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో చంద్రబాబు**

7 లో...

## ఘనంగా అయ్యప్పకు పడిపూజ



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం అయ్యప్పస్వామి ఆలయంలో ఘనంగా పడిపూజ కార్యక్రమం శనివారం నిర్వహించారు.మాల ధరించిన స్వాములకు చద్ది అందించే కార్యక్రమం 17 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఈరోజు ఆకునూరి పాంచజన్య ,శ్రీలక్ష్మి ( బుద్దాం కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ ) దంపతులు అయ్యప్ప ,గణపతి ,కుమారస్వామి ,శివపార్వతులకు అష్టోత్తర శతనామ పూజలు చేసారు.సుమారు 400 మంది స్వాములు చద్ది కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసరాజు ,గాజుల శ్రీనివాసరావు ,అట్ల వేణు మోహన రెడ్డి ,కొండలస్వామి ,కట్టా సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వర్షపునీరు తొలగింపుకు చర్యలు



కర్లపాలెం, మేజర్‌న్యూస్: మిచాంగ్ తుపాను వల్ల కర్లపాలెం పంచాయతీ లో గృహాల చుట్టూ ,పొలాల్లో నిలిచిన వర్షపునీరును బయటకు పంపించేందుకు కర్లపాలెం సర్పంచ్ శనివారం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పొలాలు ,గృహాల నుంచి రాజీవనగర్ కాలనీ వద్ద ఇసుక ఛానెల్ కు కలిసే వంతెన కింద మట్టి ,ముళ్ళపొదలతో పూడిపోయిన కాలువకు మరమ్మతులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## ఉచిత మెగా హెల్త్ క్యాంప్



కొల్లూరు,మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని ఆదివారం కాకతీయ కళ్యాణ మండపం నందు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన్ ప్రసాద్ సహకారంతో హెల్ప్ హాస్పిటల్స్ మల్టీ సూపర్ స్పెషాలిటీ కేర్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిభిరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకుజరు గుతుందని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి, కొల్లూరు మండలం మాజీ ఎంపీపీ డాక్టర్ కనకాల మధుసూదన్ ప్రసాద్ తెలిపారు.అవసరమైన వారికి రూ.12,500 విలువ గల యాంజయోగ్రమ్ విజయవాడ హెల్ప్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితముగా చేయబడుతు ఉదన్నారు. ఈ అవకాశాన్ని వేమూరు నియోజకవర్గం నుంచి అన్ని మండలాల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఎంపి మాగుంట సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు



తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తురకపాలెం గ్రామంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి సహకారంతో తురక పాలెం హైస్కూల్ దగ్గర నుండి సాగర్ కాలువ వరకు గల మట్టి రోడ్ 2కెయం మేర వేయడం జరిగింది. ఈ రోడ్ వేయడానికి సహకరంచిన ఎంపీకి వారి తనయులు మాగుంట రాఘవ రెడ్డికి తురక పాలెం గ్రామ ప్రజలు ధన్యవాదములు తెలియజేశారు.

# చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు

- అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉంది
- పంటనష్టం జరిగిన ప్రతి రైతుకు పరిహారం
- రైతులపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు
- చంద్రబాబు పై మోపిదేవి విమర్శలు



రేపల్లె, మేజర్‌న్యూస్: చంద్రబాబు నాయుడు మాటలు నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని ఆపద సమయంలో ఎవరు ఆదుకుంటారో కూడా ప్రజలు తెలుసుకున్నారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో కూడా వరదలు వచ్చాయని అప్పుడు ఏ ఒక్కరికి కూడా సరైన పరిహారం అందించలేదని ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అని ఎద్దేవా చేశారు. రైతులు అధైర్యపడొద్దు ప్రభుతం అండగా ఉందని పేర్కొన్నారు. రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతులను ఆదుకునేందుకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రైతులకు పంట నష్టం జరిగితే గిట్టుబాటు ధర కల్పించారని గుర్తుచేశారు. గత నాలుగు రోజుల క్రితం తుఫాను సృష్టించిన విలయానికి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించి జిల్లా యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారని వివరించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తూ రైతులను ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయం దండగ అన్న పెద్దమనిషి చంద్రబాబు నాయుడు తాను అధికారంలో ఉన్నప్పుడు కరువు కాటకాలు సంభవించలేదా అని ప్రశ్నించారు. కరువు చంద్రబాబు కవల పిల్లలని చమత్కరించారు. చంద్రబాబు రైతుల సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించిన దాఖలాలు తాను అధికారంలో ఉన్నపుడు లేవన్నారు. అలాంటి వ్యక్తి నేను గట్టు గట్టుకు తిరుగుతున్నాను పంట నష్టం జరిగిందని మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. చంద్రబా బు ముఖ్యమంత్రిగా ఉన్న 2014-15లో సంభవించిన హుదూద్, తిత్లి తుఫానుల్లో పంట నష్టం జరిగిన రైతులకు ఏ మేరకు న్యాయం చేశారో చెప్పాలన్నారు. చంద్రబాబు రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను సీఎం జగన్మోహన్ రెడ్డి తీర్చారని గుర్తు చేశారు. రైతులకు ఇవ్వాల్సిన ఇన్పుట్ సబ్సిడీ రూ. 960 కోట్లు పెండింగ్ పెట్టారని, సబ్సిడీ విత్తనాల బకాయి రూ.230 కోట్లు, సున్నా వడ్డీకి సంబంధించి రూ. 1200 కోట్లు, 474 మంది రైతుల ఆత్మహత్యలు చేసుకుంటే వారికి ఇవ్వాల్సిన పరిహారం రూ. 24 కోట్లు, తిత్లి తుఫాను పంట నష్టం రూ.200 కోట్లు, ఇలా మొత్తం రూ. 6000 కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీర్చారని వివరించారు. ఆనాడు చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి రైతులకు అనేక హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. రూ 74 వేల కోట్లతో రైతుల పంట రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారం వచ్చాక కేవలం రూ. 1200 కోట్ల రూపాయలు మాఫీ చేశారని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశి విశ్వనాధ్ గుప్తా,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, కౌన్సిలర్ సత్యనారాయణ, షేక్ కరీముల్లా, కట్ట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడే బాపట్ల కాపు సంఘం కార్తీకమాస వన సమారాధన

బాపట్ల టౌన్,మేజర్‌న్యూస్: బాపట్ల కాపు సేవా సంఘం గత 21 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కార్తీక మాస వన సమారాధన నేడు ఆదివారం సూర్యలంక సమీపాన జీడి మామిడి తోట ప్రాంగణంలో ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిం చుటకు నిర్ణయించడం జరిగినదని తెలియజేశారు కాపు సేవా సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ప్రస్తుత చీఫ్ విప్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ఆంధ్ర ప్రదేశ్, విశిష్ట అతిథి మరియు రథసారథి అన్నం సతీష్ ప్రభాకర్ ఎక్స్ ఎమ్మెల్సీ, ఆత్మీయ అతిథులు నరాలశెట్టిప్రకాష్ మాజీ పట్టణ వైసీపీ అధ్యక్షులు, గంటా అంజిబాబు ఏఐసిసి మెంబర్ బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిట్టా ప్రమీల రాణి మాజీ మున్సిపల్ చైర్పర్సన్, గుంటుపల్లి తులసి కుమారి జనసేన పార్టీ జిల్లా సెక్రెటరీ. హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా పురస్కారాలు ఉదయం 10 గంటలకు వనభోజనాలు మధ్యాహ్నం 12 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు మధ్యాహ్నం మూడు గంట లకు మొదలవుతాయని తెలిపారు. విద్యా పురస్కారాలు ఈ సంవత్సరం ఇంటర్మీడి యట్ మొదటి సంవత్సరం నుండి పీజీ కోర్స్ విద్యార్థుల వరకు 60 శాతం పైగా మార్కులు పొందిన వారికి ఇవ్వబడును. విద్యార్థినీ విద్యార్థులు వారు చదువుతున్న కాలేజీ ప్రిన్సిపాల్ నుండి ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలని. రేషన్ కార్డు, ఆధార్ కార్డు,పుట్టిన తేదీ, కుల ధ్రువీకరణ పత్రము, ఎస్ఎస్సి టిసి జత చేయవలెను. మార్కుల జాబితాలకు ప్రిన్సిపల్ చే అటస్టేషన్ చేసి జత చేయవలెను. అప్లికేషన్ పై ఫోటో అంటించవలెను. అర్హులైన అభ్యర్థులు పురస్కారం పొందురోజు వారి తల్లి తండ్రితో తప్పక రావలెను. లేనియెడల పురస్కారము ఇవ్వబడదని తెలియజేశారు బాపట్ల కాపు సేవా సంఘం అధ్యక్షులు ఐక్కుర్తి శ్రీనివాసరావు.

## సాయుధ దళాల పతాక దినోత్సవం



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసవర ప్రసాద్ ని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ సన్మానించారు.పట్టణంలో నరాల శెట్టి వారి పాలెం 32 వ వార్డు నందు రాష్ట్ర సమీకృత త్రివిధ దళ మాజీ సైనికుల కమిటీ ముఖ్య కార్యాలయ చైర్మన్, బాపట్ల జిల్లా త్రివిధ దళ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గా పనిచేస్తున్న రెడ్డి శ్రీనివాస వర ప్రసాద్ సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా గత సంవత్సరం ఎక్కువ మొత్తంలో విరాళాలు సేకరించినందుకు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా మాజీ సైని కుల సంక్షేమ అధికారి శ్రీమతి గుణ శీల, సిబ్బంది సమక్షం లో శాలువాతో సన్మానిస్తూ విరాళం అందించారు. రాష్ట్ర పరంగా మాజీ సైనికులకు, వితంతువులకు, జిల్లా వాసుల కు అందిస్తున్న అనేక సేవలను బట్టి వర ప్రసాద్ ను శాసన సభ్యులు కోన రఘుపతి అభినందించారు. జిల్లా వాసులు ప్రతి ఒక్కరు సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విరాళాలివ్వవలసినదిగా కలెక్టర్ కోరారు. మాజీ సైనికుల సంక్షేమ విషయాలలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ముఖ్య కార్యదర్శి షేక్ కాలేషాను గుణశీల అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయం సిబ్బంది ఆనందరావు, రాజేష్, శ్రీనివాస రెడ్డి, జిల్లా అసోసియేషన్ సభ్యులు ఖాదర్ మస్తాన్, పోలిరెడ్డి, శివనాగేశ్వరరావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు..

## కౌలు రైతుల కౌలును రద్దుచేసి, నష్టపరిహారం అందించాలి



నగరం, మేజర్‌న్యూస్ : తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసి వరి పంట నష్టపోయిన దేవాదాయ, ధర్మాదాయ భూముల కౌలు రైతుల కౌలును రద్దు చేసి, నష్టపరిహారం అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి. నాగాంజనేయులు, రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల పరిధిలోని చినమట్లపూడిలో వరిపంట నేలవాలి దెబ్బతిన్న వరిపొలాలను సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నాగాంజనేయులు, బాలాజీలు మాట్లాడుతూ తుఫాను వర్షానికి నేలవాలిన, ఓదెలపైనున్న వరి పంట నీటిలో నానటంతో మొలకలు వచ్చినందున రైతాంగం చూసి కన్నీరు పెడుతుందన్నారు. దేవాదాయశాఖ, రెవెన్యూ అధికారులెవ్వరూ తమ పంటలవైపు కన్నెత్తి చూడలేదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు పంట నష్టం నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మండే శ్రీనివాసరావు, దేవాదాయ కౌలు రైతులు షేక్ సత్తార్, నబీ, తుమ్మా ఏడుకొండలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పర్యటనలో స్థానిక నాయకత్వం విఫలం: కళ్ళం



బాపట్ల టౌన్,మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాలలో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా చూసి రైతులకు మరియు ఈ ప్రాంతానికి సహాయం చేయాలని పెద్ద మనసుతో మన ప్రియతమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి బాపట్ల వచ్చారని బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పూర్వపు అధ్యక్షులు సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాథ రెడ్డి అన్నారు.కానీ మన సమస్యలను మరియు అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం లో స్థానిక నాయకత్వం పూర్తిగా విఫలం అయింది.బాపట్ల నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాలుగా మురుగునీరు పారుదల కాలువలు మరియు సాగునీరు పారుదల కాలువలకు పూడిక తీయక మరియు మరమత్తులు చేయక రైతులకు ఇబ్బందికర పరిస్థితి ఉన్నది. నియోజక వర్గం లో ప్రధాన సాగునీటి కాలువ అయిన కొమ్మమూరు కెనాల్ తుఫాను కారణంగా అనేక చోట్ల కట్టలు తెగి పొంగి ప్రవహించింది. అలాగే ప్రధాన మురుగునీటి కాలువ అయిన నాగరాజు కాలువ జిల్లెళ్ళమూడి వంతెన వద్ద కట్టలు పొర్లి పెను ప్రమాదం జరిగే సమయానికి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి పంట భూములు ముంపుకు గురికాకుండా కాపాడినారు. అదేవిధంగా తుంగభద్ర డ్రైన్ మరియు పేరాల డ్రైన్ లు మంమత్తులు చేయక అనేక చోట్ల పంట భూములు ముంపుకు గురి అయినాయి. ఇటువంటి పరిస్థితుల్లో సాక్షాత్తు ముఖ్యమంత్రి వస్తే మన అవసరాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లలేని దుస్థితిలో మన స్థానిక నాయకత్వం ఉన్నది. తిరుపతి జిల్లాలో రు 30 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం కోసం అక్కడి నాయకత్వం ముఖ్యమంత్రి నుండి హామీ పొందినారు.ఇక్కడ కనీసం ఒక్క అవసరం తీర్చమని కూడా మన నాయకత్వం ముఖ్యమంత్రిని కోరలేదు. సమర్థవంతమైన నాయకత్వం ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం లభి.స్తుంది అని ఆశిస్తున్నట్టు తెలియజేశారు.

# వైపాలెం పోలీస్ దాష్టికంపై మార్కాపురం సబ్ కలెక్టర్‌చే విచారణ జరిపించాలి



## జిల్లా కలెక్టర్‌తో దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్

ఒంగోలు, మేజర్‌న్యూస్:యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్లో పోలీస్ దాష్టికానికి గురైన మోజేష్ బలవన్మమరణ ప్రయత్న ఘటనపై మార్కాపురం సబ్ కలెక్టర్ చే విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. శనివారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర హెూమ్ మంత్రి తానేటి వనిత నియోజక వర్గంలో దొమ్మేరు అనే గ్రామంలో బొంత రాజేంద్ర అనే యువకుడు పోలీస్ వేధింపులకు గురై నవంబర్ 14వ తేదీన ఆత్మహత్య చేసుకున్న ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం సిబి సిఐడి విచారణకు ఆదేశించిందన్నారు.

వైసిపి పార్టీ ఫ్లెక్సీల వివాదంలో దళిత యువకుడు ఐనా బొంత రాజేంద్రను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అగ్రకులాల మెప్పు కోసం పోలీస్‌లు వేదించడంతో దళిత హెూమ్ మంత్రి చెప్పిన విడిచి పెట్టకుండా దళితుడినే దమ్మేరు పోలీస్‌లు బలి తీసుకున్నరన్నారు. దళితులకు హెూమ్ ముఖ్యమంత్రి హెూమ్ మంత్రితో పాటు మంత్రి పదవులు ఎన్ని ఇచ్చిన జగన్ పాలనలో దళితులకు సామాజిక న్యాయం పేరట పోలీస్ స్టేషన్లో చావకోడుతున్నార న్నారు. కౌన్సిలింగ్ పేరుతో యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌కు ఏసుపోగు మోజెష్ అనే మాదిగ యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్ర హింసలు పెట్టి కులం పేరుతో తిట్టి అవమానించి అతని తండ్రిని కూడా దొంగ పాస్టర్ అంటూ అవమానంచడంతో పోలీస్ అరాచకానికి తట్టుకోలేక పోలీస్‌స్టేషన్ ఎదుటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించి ప్రస్తుతం గుంటూరులో చికిత్స పొందుతున్నాడ న్నారు జిల్లా కలెక్టర్, ఎస్సీ ఎస్టీ యాక్ట్ చైర్మన్ ఏసుపోగు మోజెష్ యర్రగొండపాలెం పోలీస్ ఘటనపై మార్కాపురం సబ్ కలెక్టర్‌చే విచారణ జరిపించి యర్రగొండపాలెం సిఐ ఎసై లపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే నివేదిక పంపించాలని నీలం నాగేంద్రరావు జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. ఇప్పటికే యర్రగొండ పాలెం ఘటనపై జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్ మార్కాపురం డిఎస్పీ వీరరాఘవ రెడ్డిని విచారణ అధికారిగా శనివారం నియమించారు.

# రాజకీయాలను చూస్తుంటే ఇరిటేషన్ వస్తోంది

**మొదటి పేజీ తరువాయి** వస్తే ఇప్పటి రాజకీయాలు చూస్తుంటే ఇరిటేషన్ వస్తుంది. లేనివి కూడా ఉన్నట్లు, నా కొడుకుపై ప్రచారం చేస్తున్నారు. నా కొడుక్కి జగన్ అంటే ఎంతో ఇష్టం. నా కొడుకు బి.ఆర్.ఎస్ వస్తుందంటూ తెలంగాణ కూడా వెళ్లి తిరిగాడు. నేను కాంగ్రెస్ గెలుస్తుందని స్పష్టంగా అర్థమౌతుందని 50 సీట్లు వస్తాయని.. 50 లక్షలు పందెం కాశాను. కానీ, నా కొడుకుకు తెలిసి బి.ఆర్.ఎస్ గెలిస్తుంది, నువ్వు ఎందుకు పందెం పెట్టావని నన్ను అడిగాడు. వాడి కోసం పందెం క్యాన్సిల్ చేసుకున్నానని వెల్లడించారు. వాడి ఉద్దేశం అక్కడ బిఆర్ఎస్ గెలిస్తే ఇక్కడ వైసిపి గెలుస్తుందని పేర్కొన్నారు. వాడు ఎంతసేపటికి జగన్ రావాలి జగన్ రావాలని అంటాడని, ఆయనకు కూడా మాపై ఉండాలి కదా ఉంటుందని కోరుకుంటున్నా అన్నారు. నా కుమారుడిని రాజకీయాల్లోకి తెద్దామా వద్దా అనే ఆలోచన వస్తుంది ఏది లేకపోయిన ఆరోపణలు చేయడం చూస్తే కుటుంబం మొత్తం బాధపడుతుంది. ఈసారి ఎన్నికల్లో కులం రోడ్డు మీదకు వచ్చి పని చేస్తుంది. అందువల్ల మీరు నాకు మద్దతుగా ఉంటే కచ్చితంగా పోటీ చేస్తాను. మీ కోసం నేను పనిచేశాను.. మీరు నాకోసం పని చేస్తాను అంటేనే.. ఎన్నికల్లో పోటీ చేస్తా... లేకుంటే చేయను అని బాలినేని నేతలకు స్పష్టం చేశారు. గిద్దలూరు పోతాను... పార్టీ మారతాను అని ప్రచారం చేస్తున్నారు. అవన్నీ చూస్తే ఇరిటేషన్‌గా ఉందని, నేను మాత్రం ఒంగోలు నుంచే పోటీ చేస్తానని తెలిపారు. నేను నీతిమంతుడ్ని, ఎక్కడా డబ్బులు తీడుకోలేదని కూడా చెప్పనని.. కానీ, ఒంగోలు నియోజకవర్గంలో ఎలాంటి తప్పులు చేయలేదన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు ఎవరో ఒకరు ఇస్తుంటే.. తీసుకోకుండా రాజకీయం చేయలేనన్నారు. ఒంగోలులో డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు కనీసం ఓటర్ లిస్టును కూడా వెరిఫై చేయడం లేదని... ఎందుకో నాకు అర్థం కావడం లేదని బాలినేని నేతల్ని ప్రశ్నించారు. మీరందరు పని చేస్తానంటేనే పోటీ చేస్తాను ముందుగాను ఇళ్లపట్టాలు ఇస్తేనే పోటీ చేస్తానని జగన్‌కు చెప్పాను ఆ సమస్య కూడా తీరు తుందని, రెండు సార్లు మంత్రిగా, ఎమ్మెల్యేగా పనిచేశాను. పోటీచేయపోతే ఆశలు పోతాయి కానీ నాకు కొత్తగా వచ్చేది ఏమి లేదని అన్నారు. గత ఎన్నికలల్లో మా వియ్యంకుడు డబ్బులు పెట్టారు.. నేను సంపాదించి ఉంటే ఎన్నికల్లో ఆయనతో ఎందుకు ఖర్చుపెట్టిస్తాను అని వివరించారు.

# జగన్ పాలనకు అనర్హుడు

**మొదటి పేజీ తరువాయి**

చూపుతోందన్నారు. ఒకరకంగా పూర్తిగా గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. 80,060 ఎకరాల ఆయుకట్టు ఉన్న గుండ్లకమ్మ నీటినిల్వ సామర్థ్యం 3.589 టీఎంసీలు నీటిని ఎవరికి ఉపయోగపడకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఆగస్టు 30వ తేదీ రాత్రి 3వనంబరు గేటు కొట్టుకుపోయింది. తక్షణ మరమ్మతులు సాధ్యం కాక ప్రాజెక్టులోని నీరు మొత్తం దిగువకు వదిలేశారని దీంతో ఆయ కట్టుకు నీరు లేక రైతులు అల్లాడిపోయారన్నారు. ప్రాజెక్టుపై ఆధారపడిన రెండు వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు తీవ్రంగా నష్టపోయారని, పైనుండి వరద జలాలు రావడంతో వలలు పడవలు పెద్ద ఎత్తున కొట్టుకుపోయి వేలాది రూపాయలు నష్టం కలిగిందని నష్టపోయిన జాలర్లకు నష్టపరిహారం ఇవ్వాలని పదేపదే కోరిన ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అధికారులు చలనం లేకుండా వ్యవహరించారని ప్రభుత్వం చేతకాని తనం వలనే మత్స్యకారులు ఉపాధి కోల్పోయారన్నారు. ఆ సమయంలో ప్రాజెక్టును సందర్శించిన జలవనరుల మంత్రి అంబటి రాంబాబు నెలలోగా గేట్ల మరమ్మతులు పూర్తిచేసి నీరిస్తామని డాంభీకాలు పలికి ఒకటిన్నర సంవత్సరం గడచినా నేటికీ ఆ పనులు పూర్తి చేయలేదని చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా తెదేపా ఎమ్మెల్యేలు నియోజకవర్గ, బాధ్యులు



రైతులు కలిసి పలుమార్లు ఆందోళనలు నిర్వహించినా ఈ ప్రభుత్వంలో చలనం లేదని అన్నారు.

సెప్టెంబరు నెలలో చంద్రబాబు ప్రాజెక్టుల బాట పేరుతో సందర్శన షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో హుటాహుటిన రెండు గేట్ల మరమ్మతులు చేపట్టి మమ అనిపించారని ఆరోపించారు. నాటి నుంచి ప్రాజెక్టులోకి చుక్కనీరు వచ్చిన దాఖలాలు లేవన్నారు. రైతుల పట్ల, ప్రజల పట్ల వైకాపా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. గుంటూరు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టు, ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో నిర్వహణ లోపంతో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 33మంది ప్రాణాలు పోయాయని గ్రామాలకు గ్రామాలు తుడిచి పెట్టుకుపోయాయని, వాటి నుండి గుణపాఠం నేర్చుకోలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసింది నాణ్యత లేని మద్యం అమ్మడం, ఇసుక అక్రమ రవాణా ద్వారా దోచు కోవడమేనన్నారు. ఇసుక అక్రమ రవాణా ద్వారా వైసీపీ నేతలు వెయ్యి కోట్లకు పైగా దోచుకున్నారని ఆరోపణలు గుప్పించారు. మిచౌంగ్ తుఫాన్ బాపట్ల జిల్లాలో తీరాన్ని దాటడంతో భారీ ఎత్తున వర్షాలు, గాలులు బలంగా వీయడంతో మిర్చి, మొక్కజొన్న, పొగాకు మినుము, వరి ,అరటి, బంతిపూల తోటలు, పత్తి రైతులకు తీవ్ర నష్టం జరిగినా రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రతి ఎకరాకు ఈ-క్రాప్ నిభంధనలు లేకుండా ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకునే వరకు రైతాంగం ప్రజలు తరఫున తెలుగుదేశంపార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు ఉన్నారు.

# వైసిపీ క్యాడర్ సరిగా పని చేయడం లేదు

### ఒంగోలులో 'అన్న' ఆడియో రిలీజ్ వేడుకలో బాలినేని సంచనల వ్యాఖ్యలు



ఒంగోలు, మేజర్‌న్యూస్: మీ నా కోసం పని చేస్తానని భరోసా ఇస్తే రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తా, లేదంటే ఎన్నికల బరి నుండి తప్పుకుంటానని మాజీ మంత్రి, ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసు లరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి పక్షాలు పని చేస్తున్నట్లు వైసిపీ క్యాడర్ పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలినేని జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన అన్న ఆడియో రిలీజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి రాజకీయ సంచల వ్యాఖ్యలు చేశారు. 2024 ఒంగోలులోని రాజ కీయ భవిష్యత్తుపై క్లారిటీ ఇచ్చాడు. ఇళ్ల పట్టాలు ఇస్తేనే 2024 ఎన్నికల్లో పోటీ చేస్తా తగేసి చెప్పిన బాలినేని వైసిపీ క్యాడర్ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ పని చేసినటువంటి రీతిగా వైసీపీలో కార్యకర్తల పనిచేయడం లేదని మనస్థాపానికి గురైయ్యారు. కార్యకర్తలు, ప్రజలు ప్రోత్సాహం ఉంటేనే గాని 2024వ సంవత్స ఎన్నికలలో పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రి పదవి అనుభవించను నాకేం పెద్ద కోరిక ఏమి లేదన్నారు. నేను రాజకీయాలు చేసేది ప్రజల కోసం, కార్యకర్తల కోసం మాత్రమేనని, అప్పులు చేసి రాజకీయాలు చేస్తున్నాను సంపాదించింది ఏమీ లేదన్నారు. మహా అయితే ఆస్తులు పోతాయి అంటూ భావోద్వేగానికి గురైయ్యారు.

# పవన్‌తోనే సుపరిపాలన సాధ్యం

### – 28వ డివిజన్‌లో 57వ రోజు జనచైతన్య యాత్ర



ఒంగోలు, మేజర్‌న్యూస్: జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ఆదేశాలతో మేరకు డివిజన్ అధ్యక్షులు కోట సుధీర్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను తెలుసుకోవడంలో భాగంగా 57వ రోజు జనచైతన్య యాత్రలో భాగంగా ఒంగోలులోని 28వ డివిజన్‌లో జమ్మి చెట్టు బజార్లో పర్యటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజానీకం జనసేన నాయకులతో మాట్లాడుతూ ఈ జగన్ రెడ్డి ప్రభుత్వంలో పెరిగిన ధరలతో మేము జీవనం సాగించడం చాలా కష్టంగా మారిందని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా అందరికీ ఒక అవకాశం ఇచ్చామని మాకు ఎవరూ చేసింది ఏమీ లేదని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తాను అధికారంలోకి వస్తే ఏమి చేస్తారో చెప్పిన విధానం మమ్మల్ని బాగా ఆలోచింప చేసిందని అలాంటి నాయకుడికి ఈసారి అండగా నిలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కళ్యాణ్ ముత్యాల, ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శి గోవింద్ కోమలి, ఒంగోలు నగర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి ఆకుపాటి ఉష, వీర మహిళ మాదాసు సాయి నాయుడు, జనసేన నాయకులు చెన్ను నరేష్, నరసింహారావు, పఠాన్ కాలేషా, యాదల సుధీర్, ఉంగరాల వాసు, అవినాష్ పర్చూరి, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


RISE Krishna Sai Prakasam Group of Institutions
(AUTONOMOUS)
(Approved by AICTE, & Affiliated to JNTU KAKINADA)
Off NH-16, Valluru, ONGOLE- 523272, Prakasam District, A. P.
Tel: 9502835678, 7382619792 // Websites : www.risekrishnasaiprakasamgroup.edu.in

NOTIFICATION OF
SPOT ADMISSIONS FOR THE ACADEMIC YEAR- 2023-24

Applications for admission into the following PG (MBA & MCA) seats in our institutions can be obtained from our college websites or from the college office between 9:00 A.M. to 4:30 P.M on or before 13-12-2023. The filled in applications have to be submitted on or before 13-12-2023. Admissions will be made as per G.O. issued by **APSCHE.**

RISE KRISHNA SAI PRAKASAM GROUP OF INSTITUTIONS

| Branch | MBA | MCA |
|---|---|---|
| No.of Vacancies | OTHERS : 24 | OTHERS : 06 |
| | EWS : 06 | EWS : 00 |

Sd/- SECRETARY & CORRESPONDENT

## నాడు -నేడు లో ఆగిపోయిన నిధులను వెంటనే మంజూరు చేయాల



కొల్లూరు,మేజర్‌న్యూస్: తోకలవానిపాలెంలో మిచాంగ్ తుఫాను కి వర్షపు నీరు ఇంట్లోకి రావడంతో దోనెపూడి జిల్లా పరిషత్ హై స్కూల్లో చదివే ఇద్దరు విద్యార్థులు పుస్తకాలు తడిసిపోవడంతో కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించి కొత్త పుస్తకాలు పంపిణీ చేయటం జరిగినది. ప్రవీణ్ ప్రకాష్ తోకలవానిపాలెం వచ్చిన సందర్భంగా తోకలవానిపాలెంలోని ప్రాథమిక పాఠశాలకి గత సంవత్సరం నవంబర్ లో 11 లక్షల రూపాయలు నాడు నేడు కింద మంజూరైనవి ,కానీ నేటికీ కేవలం 3,50,000 మాత్రమే వచ్చివి, ఆ డబ్బులతో పనిచేయడం జరిగినది మిగతా డబ్బులు విడుదల కాకపోవడంతో పాఠశాల లో పనులు అసంపూర్తిగా మిగిలిపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి సర్పంచ్ టి కృష్ణమోహన్ తీసుకొని వెళ్ళటం జరిగినది, అలాగే మిగిలిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని ప్రవీణ్ ప్రకాష్ వినతి పత్రం ఇవ్వడం జరిగినది. వినతి పత్రం ఇచ్చిన తర్వాత ప్రవీణ్ ప్రకాష్ డీఈఓ కి ఇచ్చి వెంటనే రిపోర్టు పంపించమని చెప్పడం జరిగినది ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మరియు మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధితులకు కూరగాయలు పంపిణీ



బాపట్ల, మేజర్‌న్యూస్: స్థానిక బాపట్ల ఏడవ వార్డు వెన్నెగంటి నగర్ కాలనీ (యానాదులు ) ఇల్లు అన్ని నీరు పోయే దారి లేక వారం రోజుల నుండి ఇళ్ల చుట్టూ నీరు చేరి ఉన్నది. కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం బాపట్ల జిల్లా తుఫానుకు దెబ్బతిన్న పొలాలను నష్టపోయిన రైతులను పేటేరు, భట్టిప్రోలు, బాపట్ల, పరుచూరు నీట మునిగిన పొలాలను, నష్టపోయిన రైతులను పరామర్శించి బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడి శీలం మాట్లాడుతూ ఏడవ వార్డు వెన్నగంటి నగర్ కాలనీ చుట్టూ నీరు అలాగే ఉండటం ఎవరు ఇంతవరకు నీరు పోయే విధంగా ఎవరు పట్టించుకోనలేదని చెప్పారు. జెడి శీలం మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి ఆదివారం ఉదయం కల్లా నీరు పోయే విధంగ చేయాలని కమిషనర్ తో చెప్పారు.ఈ కార్యక్రమంలో గంటా అంజిబాబు, శ్రీపతి ప్రకాష్ కాంగ్రెస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్, తోట శివ నాగేశ్వరరావు పిసిసి జనరల్ సెక్రెటరీ, ధోనిపూడి (డి ఆర్ ) పటాన్ రాజేష్, చింతా బాబురావు, ఎస్వీఆర్ కుమార్, రవి పాల్గొన్నా రు.

## పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



బాపట్ల,మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం త్రవ్వకాలవ రోడ్డు మహాలక్షమ్మ చెట్టు బజార్ నందు చెత్తను గతములో రోజు ట్రాక్టర్ వచ్చి తీసుకుని వెళ్ళేది.ఇప్పుడు రెండు, మూడు రోజులకు ఒకసారి వచ్చి చెత్తను ట్రాక్టర్ తీసుకువెళ్తుంది.ఈలోగా అక్కడ ఉన్న చెత్త ఫంక్షన్లు నిర్వహించుకున్న వారి ఎంగిలి విస్తర్లు, చెత్త, కాగితాలు ఇల్ల ముందుకు కొట్టుకు వచ్చి బాగా ఇబ్బందికరంగా ఉందని స్థానిక ఇల్లవారు గోల చేస్తున్నారు.గతంలో వార్డులో రోడ్లు ఉడవడానికి ఇద్దరు, ముగ్గురు ఉండేవారు. కానీ ఇప్పుడు ఒక ఆమెనే పెట్టి ఇబ్బంది పెడుతున్నట్లుగా ఉన్నదిలి అని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇక్కడ చెత్త ఎక్కువగా పేరుకుపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతూ పందులు, కుక్కలు, ఆవులు వాటిని ఆగం ఆగం చేస్తున్నాయి. కావున వెంటనే చెత్తను తీసివే యవలసిందిగా స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా చంద్రబాబుకు జగన్ కు: కోన



బాపట్లటౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం రథం బజార్ సెంటర్ కోన చాంపర్స్ నందు వైయస్సార్సీపి బాపట్ల నియోజకవర్గ శాసనసభ సభ్యుడు కోన రఘుపతి మిచౌంగ్ తుఫాన్ బాధిత ప్రాంతాల్లో పర్యటించిన జగన్ పై జరుగుతున్న విష ప్రచారాన్ని ఖండిస్తూ పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే రఘుపతి మీడియాతో మాట్లాడుతూ మిఛౌంగ్ తుఫాను వల్ల జిల్లాలో ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందన్నారు.ప్రతిపక్ష నేత చంద్రబాబు చేసే విమర్శలు అర్థరహితం అన్నారు. గతంలో 2,500 కూడా ఎకరానికి ఇవ్వని చంద్రబాబు నేడు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా చంద్రబాబుకు, జగన్ కు ఉందన్నారు.మాట మీద నిలబడేతత్వం చంద్రబాబుకు లేదన్నారు.రైతులకు మేలు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.చంద్రబాబు అడిగినా అడక్కపోయినా సీఎం జగన్ సంక్రాంతి పండుగ లోపు న్యాయం చేస్తారని చెప్పారు. రాబోయే కాలంలో నల్లమడ డ్రేయిన్ ఆధునీకరిస్తామని చెప్పారు. భర్తిపూడి సంఘటన దుర దృష్ట కరం అన్నారు. ఎవరు తప్పు చేసినట్లు తేలినా చట్ట పరిధిలో చర్యలు ఉంటాయని చెప్పారు.మాకు కూడా ఎన్టీఆర్ అంటే గౌరవం ఉందన్నారు. మీలాగా ఓట్ల కోసం ఎన్టీఆర్ ను వాడుకునే సంస్కృతి వైసిపికి లేదన్నారు. అవకాశవాద రాజకీయాలకు దూరంగా ఉండాలని మా నాయకుడు జగన్ తమకు నేర్పారని అన్నారు. తుఫాను పరిహారం పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో అందిస్తున్నాం.

## అందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందజేత



రేపల్లె, మేజర్‌న్యూస్: పంచాయతీలో ఉన్న ప్రతి ఒక్కరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను పార్టీలకతీతంగా అందిస్తున్నామని మోర్లవారిపాలెం సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ సోమ శేఖర్ అన్నారు శనివారం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన విక్షిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్రామంలో నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన వివిధ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తున్నామని ఆమె తెలిపారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు సహకారంతో గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేమని గతంలో త్రాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని కానీ మోపిదేవి సహకారంతో మంచినీటి సమస్యను పరిష్కరించామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుమూరు ఎంపీటీసీ సభ్యులు అలివేలు మంగ మ్మ, ఈ.ఓ.పి.ఆర్.డి మల్లిఖార్జున రావు, పంచాయతీ కార్య దర్శి ప్రసాద్,సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, వాలంటీర్స్, గ్రామ ప్రజలు,ఏఎన్ఎం స్, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ లో మొత్తము 174 కేసులను పరిష్కరం



బాపట్ల,మేజర్‌న్యూస్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశాల మేరకు శనివారం ది. 9 12 2023న మండల న్యాయ సేవాధికార సంస్థ, బాపట్ల వారి ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా కోర్టుల సముదాయము నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించటం జరిగింది. ఈ జాతీయ లోక్ అదాలత్ లో మొత్తము 174 కేసులను పరిష్కరించడం మరియు మొత్తం 45,55555.00 రూపాయల లావాదేవీలు జరిగినవి. ఈ జాతీయ లోక్ అదాలత్ లో కె.పి బాలాజీ చైర్మన్ మండల న్యాయ సేవాధికార సంస్థ మరియు ఆరవ అదనపు జిల్లా బాపట్ల , ఎం పవన్ కుమార్ అదనపు సీనియర్ సివిల్ జడ్జి మరియు జి రుక్మిణి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కేసులను పరిష్కరించటం జరిగింది. మిస్ జి.వాణి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, మహేంద్ర నాథ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూ టర్, బిల్లా కమల్ కుమార్ వైస్ ప్రెసిడెంట్, బార్ అసోసియేషన్ బాపట్ల, లోక్ అదాలత్ సభ్యులు బి.లీలా కృష్ణ , వై.ఉషారాణి మరియు సిహెచ్.సౌలు రాజు , ఇతర సీని యర్ న్యాయవాదులు మరియు జూనియర్ న్యాయ వాదు లు పోలీస్ సిబ్బంది బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత భారతంను ప్రజలకు బాధ్యతగా తెలియ జేయాలి: ఎంపీటీసీ తాంద్ర




కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం మం డలం నల్లమోతువా రిపాలెం గ్రామ సచి వాలయం ఆవరణలో జరిగిన వికసిత భారతం కార్యక్రమంలో పాల్గొని, ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజారంజకమైన పరిపాలనతో వికసిస్తున్న ఆంధ్రప్రదేశ్ గురించి అదేవిధంగా మోడీ గారి ప్రభుత్వంలో వికసిస్తున్న భార తదేశం గురించి ఎంపీటీసీ సభ్యులు, బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్య క్షులు తాంద్ర సాంబశివ రావు తెలియజేసారు. ఈ సందర్భ ంగా ఎంపీటీసీ తాంద్ర మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఇటు రాష్ట్రంలో కానీ , దేశంలో కానీ జరుగుతున్న మంచి పనులను అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దేశ అభివృద్ధి లేక రాష్ట్ర అభివృద్ధి కానీ కోరు కొనే వారు అన్ని సమయాలలో రాజకీ యాలు చేయకూడదని కేవలం ఎన్నికల సమయాలలో మాత్రమే రాజకీయాలు ఉండాలన్నారు. ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరూ రాష్ట్రాల హితం కోసం తద్వారా దేశ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించుకుంటేనే డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళి తద్వారా నేతాజీ సుభాష్ చంద్రబోస్ లాంటి స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలకు న్యాయం చేసిన వాళ్ళం అవుతాం అని తెలియ జేశారు. కార్యక్రమంలో ఈ ఓఆర్డీ ఎలీషా బాబు, కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గోపీనాథ్, సెక్రటరీ పి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు మణి యాదవ్, భావన్నారాయణ, శ్రీని వాస రెడ్డి, బండ్రెడ్డి శ్రీ హరి, సచివాలయం సిబ్బంది, వాలం టీర్లు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చంద్రబాబు వచ్చి మాలో మాకు చిచ్చు పెడుతున్నాడు

### - మంత్రి డాక్టర్ మెరుగ నాగార్జున



కొల్లూరు,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైనకొల్లూరు లోని వైయస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిమెరుగు నాగార్జున మాట్లాడుతూ సస్యశ్యామలంగా ఉన్నా మా నియోజకవర్గంలో చంద్రబాబు వచ్చి మాలో మాకు చిచ్చు పెడుతున్నాడు అన్ని కులాల వాళ్లు ఒక తాటిపై నడుస్తున్న ఈ నియోజకవర్గంలో కులమాతాల చిచ్చు పెడుతున్నాడని ఆయన అన్నారు.పంట నష్టపోయిన రైతులను పరామర్శించడానికి వచ్చి ఇలా మాట్లాడటం సబబు కాదన్నారు .అయినా చంద్రబాబుకి నా నియోజకవర్గ పరిధిలో ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయో తెలుసా ఏ సీజన్ కి ఏ పంట వేస్తారో తెలుసా అవేమీ తెలియకుండా నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదన్నారు .కోట్ల రూపాయలు పేదల ట్రైనింగ్ కొరకు నిధులు విడుదల చేసి ఆ నిధులనే మింగేసావు అని అన్నారు .నీకు చేతనైతే పంట నష్టపోయిన రైతులకు సహాయం చేయాలి కానీ ఇక్కడ రాజకీయం ఎందుకు బాబు అని ఆయన అన్నారు,ఈ సమావేశంలో వేమూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బుల్లెమ్మంత ఏడుకొండలు, కొల్లూరువైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సింగం కృష్ణ, ఉప్పు శ్రీనివాసరావు, అంబటి కిరణ్ బాబు,ఆళ్ళమూడి మధు, మేరీస్ బాబు , వేమూరు నియోజకవర్గనియోజకవర్గ వైసిపి నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోపిదేవి సహకారంతో కాలువ పూడిక తీత పనులు

రేపల్లె, మేజర్‌న్యూస్: మిచాన్ తుఫాను కారణంగా పంట పొలాల్లోని వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక రైతన్నలు ఆందోళన చెందుతున్న విషయం రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే కాలువ పూడిక తీత పనులను చేపట్టాలని సూచించినట్లు విశ్వేశ్వరం గ్రామ సర్పంచ్ కర్రీ శివమల్లేశ్వరరావు తెలిపారు. శనివారం పంచాయతీ పరిధిలో గల మురుగునీరుపారుదల కాలువలో పేరుకుపోయిన తూటికాడను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు మంచి ఆహారం అందించడమే కాకుండా వారు తిరిగి వారి గృహాలకు వెళ్లేందుకు 2500 రూపాయలు నగదును నిత్యాస సరుకులను అందజేశామని సర్పంచ్ తెలిపారు.

గతంలో తుఫాను వచ్చి వెళ్లిన నెలలు గడిచి న తర్వాత అరకొరగా ఆర్థిక సహాయం వారి పార్టీ వారికే అందించే వారని ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న ప్రతి ఒక్కరికి రోజుల్లోనే సహాయం అందించినట్లు సర్పంచ్ తెలిపారు.

## వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం




మార్కాపురం, మేజర్‌న్యూస్: పట్టణంలోని శాసనస భ్యులు కార్యాలయంలో నియోజకవర్గ వైయస్సార్సీపి ఆత్మీయ సమావేశం శనివారం ఉదయం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మార్కాపురం శాసనస భ్యులు కేపీ నాగార్జున రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సోషల్ మీడియా నియోజకవర్గంలో అద్భుతంగా పనిచేస్తుందని ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గోలమరి శ్రీనివాస రెడ్డి, ప్రకాశం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాజిరెడ్డి, మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ వాసుదేవ రెడ్డి, అన్ని మండలాల కన్వీనర్లు, కో-కన్వీనర్లు పాల్గొన్నారు. అనంతరం మార్కాపురం శాసనసభ్యులు కెపి నాగార్జున రెడ్డిని ఘనంగా సత్కరించారు.

## కేంద్ర పథకాలపై బిజిపి నేతల ప్రచారం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: గిద్దలూరు రూరల్ బీజేపీ అధ్యక్షుడు కె.తిరుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు అసెంబ్లీ పరిధజలోని జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు వివిధ వర్గాల ప్రజలకు వివరిస్తూ దిగువమెట్ట గ్రామంలో ఇంటి ఇంటికి కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తూ కేంద్రం ప్రధాన మంత్రి అవస్ యోజన పథకం ద్వారా ప్రతి పేద కుటుంబంకు ఇంటిని ఏర్పాటు చేసుకోవడానికి రూ.15వేలు ఇస్తుంది. అంతే కాకుండా విశ్వకర్మ కౌసల్య యోజన పథకం ద్వారా చేతి వృత్తులు చేసే వారికి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని 1లక్ష రూపాయలు లోన్ ఇస్తారు. ఉజ్వల యోజన పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్ యువ్వటం జరగుతుందని ఈ అవకాశం వినియోగించు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు అపిసెట్టి ఉదయ్ శంకర్ (శేఖర్), జిల్లా కార్యవర్గ సభ్యు లు ముప్పూరీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి ఎం.వి. రమణ, రమేష్ మొదలైన వారు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



ఎర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టి కార్యాలయంలో సోనియా గాంధీ 76వ జన్మదినోత్సవ వేడుకలను ఏపీసిసి సభ్యులు ఎర్రగొం డపాలెం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నాడు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ సోనియమ్మ భర్త రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన కూడా భయ పడకుండా తనకు తన పిల్లలకు ప్రాణహాని ఉందని తెలిసినా కూడా రాహుల్ గాంధీ ప్రియాంకా గాంధీలను దేశ ప్రజల కోసం ప్రాణాలను పనంగా పెట్టిన ధీర వనిత సోనియాగాంధీ అని 2024లో సోనియమ్మ ఆసిస్సులతో రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీనీ ఓడించి దేశాన్ని బీజేపీ కబంధ హస్తాల నుండి కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలుగా మనందరి మీద ఉన్నదని తెలిపారు. సోనియా గాంధీ ఒక త్యాగశీలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చంటయ్య షేక్ కాశింవలి, బి.వెంకట య్య, వెంకటరామయ్య, టి.అచ్యు తరావు, షేక్ వలి మంత్రునాయక్ కిషోర్, కాంగ్రెస్ పార్టి ముఖ్య నాయ కులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను పూర్తిగా ప్రభుత్వం ఆదుకోవాలి



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు పరిసర గ్రామాలలో ఇటీవల తుఫాన్ కారణంగా నీటమునిగి నేల వాలిన పంట పొలా లను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు,మాజీ రాజ్యసభ సభ్యులు జేడి శీలం,పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి శనివారం పరిశీలించారు. అనం తరం మీడియాతో మాట్లాడుతూ ప్రభు త్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగిందని దీనికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.నష్ట పోయిన ప్రతి ఎకరాకు రూ 25 వేలు చొప్పున నష్టపరి హారం తక్షణమే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పంటల బీమాను కూడాపూర్తిగా,త్వరితగతిన అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని కోరారు. అంతేకాకుండా రెండ వ పంటకు కూడా నీరు అందేలా చర్య లు తీసుకోవాలని,అందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు బ్యాంకు లలో తీసు కున్న వ్యవ సాయ రుణాలను పూర్తిగా రద్దు చేయా లన్నారు. కేంద్రం దృష్టికి రైతుల సమస్య ను తీసుకువెళ్ళి రైతులకు తగిన న్యా యం జరిగేటట్లు కృషి చేస్తానని రైతు లకు హామీ ఇచ్చారు. అనంతరం ఎ ఐ సి సి అధ్యక్షురాలు సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా రైతు కూలీలకు కూరగాయలు, నిత్యవ సర వస్తువులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జెడి శీలం వెంట బాపట్ల జిల్లా పార్టీ అధ్య క్షులు, ఘంటా అంజిబాబు, ఉపాధ్యక్షు లు శ్రీపతిప్రకాష్,వేమూరు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ తాడికొండ వెంకటేశ్వర రావు,తోట శివ నాగేశ్వరరావు, రాయ పూడి రవీంద్ర, అను ప్రవల్లిక,యశోదకృ ష్ణ,నగేష్, నిజాంపట్నం ఏడుకొండలు, గౌస్ బేగ్, ప్రసాదు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 45 కేసులు పరిష్కారం



కనిగిరి, మేజర్‌న్యూస్: కనిగిరి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 45 కేసులు పరిష్కారం అయినట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్ చంద్ర తెలిపారు. సంవత్సరం కిందట కుటుంబ కలహలతో కేసులు పెట్టుకొని విడిపోయిన భార్యాభర్తలు లోక్ అదాలత్‌లో ఇరువురు రాజీ పడి ఒకటయ్యారు. ఈ లోక్ అదాలత్ వలన మా కుటుంబానికి మేలు జరిగినదని మా సమస్యలకు పరిష్కారం చూపి మా కుటుంబాన్ని కలిసి ఉండేటట్లుగా చేసిన కోర్టువారికి, పోలీస్ వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 41, సివిల్ కేసులు1, భరణం కేసులు 3 ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు.కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజ మార్గాన్ని అనుసరించాలని జడ్జి కె.భరత్ చంద్ర సూచించారు.చిన్న పొరపాటు క్షణికావేశం కారణంగా గొడవలు, మనస్పర్థలు పెట్టుకొని కేసులు దాకా వెళ్ళి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కనిగిరి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది ఉన్నారు.

# అన్నా రాంబాబుతోనే దళితులకు న్యాయం





బేస్తవారిపేట, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని బేస్తవారిపేట పంచాయతీ ప్రెసి డెంట్ ముద్దుల ఆశ్రిత జ్యోతి ఇటీవల గిద్దలూరు నియోజకవర్గ స్వతంత్ర అభ్య ర్థిని చెప్పుకుంటున్న దేశ బోయిన వెంకట్ రాజు సోషల్ మీడియాలో దళితులకు అన్యాయం జరిగిందని ఇచ్చిన సందేశాన్నికి స్పందిస్తూ బేస్తవారిపేట సర్పంచ్ ముద్దుల ఆశ్రిత జ్యోతి మాట్లాడుతూ మీరు దళిత నాయకులకు అన్యాయం జరిగిందని ఇచ్చే ప్రకటనను ఒక దళిత నాయకుడిగా నేను పూర్తిగా ఖండిస్తు న్నాను. గిద్దలూ రు నియోజకవర్గంలో శాసనసభ్యులు నూటికి నూరు శాతం ప్రజారంజిక పరిపాలన కొనసాగి స్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా గిద్దలూరు నియోజ కవర్గంలో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నటువంటి దళితులకు అన్యాయం జరిగిందని మీరు చెప్పటం నూటికి నూరు శాతం తప్పు. గిద్దలూరు నియోజకవర్గంలో ఉన్నటు వంటి రాజ్యాంగ బద్ధమైన పదవులులో లేదా, నామినేటెడ్ పోస్ట్‌లో ఉన్నటువంటి మా అందరి దళిత నాయకులకు శాసనసభ్యులు అన్న వెంకట్ రాంబాబు ఎప్పుడు వెన్నుంటి ప్రోత్సహిస్తూ మాకు సమాజంలో ఒక సుమి చితమైన స్థానము కల్పించినందుకు మేము శాసనసభ్యులకు ఎప్పటికీ రుణపడి ఉంటామని గర్వంగా చెప్పగలము. దళితులకు అన్యాయం జరిగిందని చెప్పే అర్హత మీకు లేదు. మమ్మల్ని మీరు ఉపయోగించుకోవడం ఎంత వరకు సమంజసం ఒక్కసారి మీరు ఆలోచించండి. గిద్దలూ రు నియోజకవర్గంలో సమాజంలో దళిత నాయకులకు గౌరవం ఉందంటే అది శాసనసభ్యులు అన్నా వెంకట రాంబాబు మాకిచ్చినటువంటి అత్యంత గౌరవమని మేము చెప్పవచ్చు. దేశబోయిన వెంకట్ రాజుకి ఒక మనవి, మీ దగ్గరికి ఏ దళిత నాయకుడు వచ్చి మాకు అవమానము అన్యాయం జరిగిందని చెప్పినారా.? శాసనసభ్యులకు, మా దళిత నాయకుల మధ్య విభేదాలు సృష్టించడానికి మీరు ఎంత విశ్వప్రయత్నం చేసినా అది మీ వల్ల కాదని తెలియజేస్తూ మరొకసారి ఇటువంటి కామెంట్లు చేయవద్దని తెలిపారు అలాగే దళితులకు అత్యధిక ప్రాధాన్యమిచ్చే శాసనసభ్యులు రాంబాబుకి సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు ముద్దుల ప్రేమానందం ధన్యవాదాలు తెలియజేశారు.

# కామ్రేడ్ మాదాల నారాయణస్వామి ఆశయాల కోసం పోరాడదాం



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: అమరుడు కామ్రేడ్ మాదాల నారాయణస్వామి ఆశయం మైన సమసమాజ స్థాపన కోసం విప్లవ శక్తులు ఐక్యంగా పోరాడాలని, ప్రతిఘటన పోరాటాలు నిర్మించాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ మోహన్ పిలుపు నిచ్చినారు. శనివారం కామ్రేడ్ మాదాల నారాయణస్వామి 10వ వర్ధంతి సభ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మైనంపాడు గ్రామంలోని గుండ్లవాగు వద్ద గల నారాయణస్వామి స్తూపం వద్ద జరిగింది. ఈ వర్ధంతి సభకు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ నాగరాజు అధ్యక్షత వహించారు. జెండాను న్యూడెమోక్రసీ సభ్యులు ఆర్.మోహన్ ఆవిష్క రించారు. అనంతరం మాదాల నారాయణస్వామి స్థూపానికి న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వై వి కృష్ణారావు, కామ్రేడ్ మాదాల కోటయ్య స్తూపానికి ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.భారతి, మాదాల నరసయ్య స్థూపానికి లెక్చరర్ సిహెచ్ శ్రీనివాసులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ జాలయ్య, ప్రగశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ రాజశేఖర్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు టి.వెంకట్రావు, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ సిసింద్రీ బాబు, పివైఎల్ జిల్లా నాయకులు సిహెచ్ తిరుమలరావు, టి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ జాన్ వెంకటయ్య మృతి



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండల కేంద్రం సీనియర్ పాస్టర్‌గా కొనసాగుతు న్న రెవరెండ్ జాన్ వెంకటయ్య (80)శు క్రవారం తెల్లవారుజామున గుండెపోటు తో ఆయన స్వగృహంలో మృతి చెం దారు. ఈ వార్త తెలుసుకున్న మండలం లోని వివిధ పార్టీల నాయకులు పాస్టర్లు భారీగా తరలివచ్చి జాన్ వెంకటయ్య మృతదేహానికి నివాళులర్పించారు. నివా ళులర్పించిన వారిలో మండల వైసీపీ కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి సర్పం చ్ చిత్తూరు హారిక ఉపసర్పంచ్ దూదేకు ల రసూల్ షేక్ అబ్దుల్ మజీద్, ఉపా ధ్యాయులు వివిధ గ్రామాల పాస్టర్లు ఉన్నారు. జాన్ వెంకటయ్య ఎన్నో సంవత్సరాలుగా ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి సీని యర్ పాస్టర్ గామండలంలో కొనసాగు చున్నారు. అదేవిధంగా వెంకటయ్య పెద్ద కుమారుడు ముండ్ల వేదాంత ప్రభాకర్ గతంలో మండల పరిషత్ అధ్యక్షులుగా కూడా పని చేసి ఉన్నందున వివిధ గ్రామాల నుండి భారీగా అభిమానులు ఆయన మృతదేహానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## విద్యుత్ ఘాతంతో వాలంటీర్ మృతి



బేస్తవారిపేట, మేజర్‌న్యూస్: మండలం లోని పూసలపాడు గ్రామంలో పత్తిరెడ్డి నాగార్జునరెడ్డి (27) అనే యువకుడు తన పొలానికి నీరు కట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. యువకుడు నాగా ర్జున వాలంటీర్‌గా విధులు నిర్వహి స్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. సమా చారం అందుకున్న ఎస్సై బి.నరసిం హారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## చంద్రబాబును కలిసిన ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మేజర్‌న్యూస్: తుఫాను తాకిడికి నష్టపోయిన రైతులను పరామర్శిస్తున్న నారా చంద్రబాబు నాయుడును కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తుఫాను ప్రభావంతో కందుకూరు నియోజకవర్గంలో సుమారు 500 హెక్టార్లలో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని నాగేశ్వరరావు, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పంట నష్టం వివరాలను చంద్రబాబు కు అందజేశారు. అలాగే సోమశిల ప్రాజెక్టు నుంచి నీళ్లు సక్రమంగా రాకపోవడంతో, రాళ్లపాడు రిజర్వాయర్ కింద వరి సాగు ప్రశ్నార్ధకంగా మారిందని నాగేశ్వరరావు వివరించారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.



## అయ్యప్ప పూజా కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య

అద్దంకి, మేజర్‌న్యూస్: పట్టణంలోని భవాని సెంటర్ నందు గల వెయ్యి స్తంభాల దేవస్థానం నందు శనివారం జరిగిన అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో శాప్ నెట్ చైర్మన్ నియోజకవర్గ ఇన్చార్జి బాచిన కృష్ణ చైతన్య



పాల్గొన్నారు. ఒకటవ వార్డు కౌన్సిలర్ కొత్త గొర్ల వెంకట సుబ్బారావు అయ్యప్ప మాల దీక్ష చేపట్టి వేయి స్తంభాల ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలా దీక్ష చేపట్టిన స్వాములకు అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి మండల మరియు పట్టణ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన ముత్తుముల

గిద్దలూరు, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిశారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు బాపట్ల



పార్లమెంట్‌లో పర్యటిస్తున్న చంద్రబాబుని జడ్పీటీసీ బుడతా మధుసూదన్ యాదవ్, మాజీ సర్పంచ్ చెన్నబోయిన రామకృష్ణ యాదవ్‌లతో సహా ముత్తుముల అశోక్ రెడ్డి గారు కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. జగన్ అరాచక పాలనను వ్యతిరేకిస్తూ వైసీపీని వీడి టీడీపీలో చేరిన జడ్పీటీసీ, మాజీ సర్పంచ్‌లను అభినందిస్తూ రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్ రెడ్డి గెలుపు కోసం కష్టపడి పని చేయాలని ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండాలని, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు అవ్వటం ఖాయమని, అందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# వైకాపా రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడాలి

**– ఒక్క అవకాశం ఇవ్వండి నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరుస్తా**

**– బాబు ష్యూరిటీ,భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మార్కాపురం మాజీ శాసన సభ్యులు కందుల**





పొదిలి,మేజర్‌న్యూస్: వైకాపా రాక్షస పాలనకు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి కోరారు.శనివారం స్థానిక ఆరవ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న కందులకు మహిళలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు.నాయకులు కందులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సంధర్భంగా కందుల మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్వనాశనం చేశారన్నారు.రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు.తనకు ఎమ్మెల్యేగా క్క అవకాశం కల్పిస్తే నియోజవర్గ ప్రజల కష్టాలు తీరుస్తానని హామీనిచ్చారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్,టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ ,రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆవులూరి యలమంద,మండల కన్వీనర్ మీగడ ఓబులరెడ్డి,పట్టణ కన్వీనర్ ముల్లా ఖుద్దూస్,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్,టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ గౌస్‌బాష,రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి ఎస్‌ఎం బాష,జిల్లా లీగల్‌సెల్ అధికార ప్రతినిధి షేక్ షబ్బీర్, జిల్లా కార్యదర్శులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి,పొల్లా నరసింహారావు యాదవ్, మాజీ శివాలయం ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు,మైనార్టీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి షేక్ యాసిన్,మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను,మండల యూత్ అధ్యక్షులు పోపూరి నరేష్‌బాబు,మాజీ ఎంపిటిసిలు మాంసాహెబ్,గాలిముట్టి నరసింహారావు,మహిళా నాయకులు షేక్ షహనాజ్‌బేగం,షేక్ మెహరున్నీసాబేగం,మాజీ టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు షేక్ షబ్బీర్,మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లికార్జున,షేక్ షాహీద్,వీరిశెట్టి సురేష్,షేక్ మౌలాలి,గన్‌మెన్ నజీర్,షేక్ సందానీ,ముల్లా ఖయ్యుం,ముల్లా బుచ్చిబాబు,ముల్లా రబ్బానీ,ముల్లా నాయబ్‌రసూల్,టెంట్‌హౌస్ రాము,ముని శ్రీను,టెంట్‌హౌస్ రాము,షేక్ అల్లబకాష్,యూత్ నాయకులు షేక్ కాలేషా,మొహ్మద్,ముక్కెర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రీడాకారునికి రూ.20 వేలు ఆర్థిక సహాయం

చీమకుర్తి, మేజర్‌న్యూస్ః విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని ఉన్నతస్థాయిలో రాణిస్తూ దేశానికి పేరుప్రతిష్టలు తేవాలని చీమకుర్తి లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు, ప్రముఖ వైద్యులు డాక్టరు.బి.జవహర్ పేర్కొన్నారు. జనవరి 14వ తేది నుండి దుబాయ్‌లో జరగనున్న ఏషియన్ డాడ్జ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలల్లో అండర్ 16 బాయిస్ విభాగంలో పాల్గొనే అవకాశాన్ని



చీమకుర్తికి చెందిన నారాయణ స్కూల్ 9వ తరగతి విద్యార్థి యం.విశ్వసాయి సాధించాడు. అయితే దుబాయ్ వె ళ్లివచ్చేందుకు ప్రయాణఖర్చులు, ఇతర క్రీడావసర ఖర్చులను భరించలేని సాధారణ కుటుంబానికి చెందిన విశ్వసాయి చీమకుర్తి లయన్స్‌క్లబ్ వారిని సంప్రదించగా వెంటనే స్పందించి శనివారం రూ.20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని క్లబ్ డైరెక్టరు, ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరీ నారాయణ మరియు ప్రముఖ వైద్యులు డాక్టరు.బి.జవహర్ సంయుక్తంగా ఆర్థిక సహాయాన్ని విశ్వసాయికి అందజేశారు. ఈ సందర్భంగా చలువాది బదరీ నారాయణ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డైరెక్టరు చలువాది రమేష్, స్కూల్ పి.డి.,యం.సుబ్బారావు, వై.రామక్రిష్ణ, పి.రవికుమార్, ఎం.సుదీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## భైరవకోనలో అధికారుల పూజలు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోన శనివారం భక్తులు పర్యాటకులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం శ్రీత్రిముఖ దుర్గాంబ అమ్మవారు, కాలభైరవేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి ఇతర శివలింగాలను పూజించి పంచామృత అభిషేకం నిర్వహించి అనంతరం పట్టువస్త్రాలు పూలమాలలతో అలంకరించి కుంకుమార్చన విశేషపూజలను నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో మండల తహశీల్దార్ షేక్ నాగుల్ మీరా దంపతులు, మండల పరిషత్ ఇఓపిఆర్డి సుందరరామయ్య దంపతులు, పలువురు భక్తులు పాల్గొని పూజలుచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్, ఇఓపిఆర్డి దంపతులను నల్లమడుగుల యంపిటిసి ముడుమాల ఆర్.నారాయణరెడ్డి దేవస్థానం పట్టువస్త్రాలతో సత్కరించారు. అదేవిధంగా జలపాతం వద్ద భక్తులకు పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా ప్రమాదాలు జరగకుండా దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ సిద్దురమణారెడ్డి ఇఓ నర్రానారాయణరెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుని ఎటువంటి తొక్కిసలాట లేకుండా సిబ్బందిని నియమించారు. శనివారం సెలవు దినం కావడం జలపాతం వద్ద అధికంగా నీరు ప్రవహిస్తుండటంతో భక్తులు పర్యాటకులు అధికసంఖ్యలో పాల్గొనడంతో భైరవకోన పరిసరాలు సందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పర్యాటకులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

గిద్దలూరు, మేజర్‌న్యూస్: శనివారం దేశవ్యాప్తంగా జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా గిద్దలూరు కోర్ట్ ఆవరణ నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా ధానమ్మ మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ వల్ల ఇరు వర్గాల వారికి సమన్యాయం జరుగునని, డబ్బు, సమయం ఆదా అవుతుందని తెలియజేశారు. ఈ లోక్ అదాలత్ లో మొత్తం కేసులు 126 పరిష్కరించబడినవి.సివిల్ కేసులు 4 క్రిమినల్ కేసులు 113, బి.యస్.ఎన్.ల్ కేసులు 9పరిష్కరించబడినది. ఈ లోక్ అదాలత్‌లో బెంచి సభ్యులుగా జి.ఆనంద్ కుమార్, ఎం.పిచ్చయ్య న్యాయవాదులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టి. శ్రీనువాసులు,బార్



అసోసియేషన్ అధ్యక్షులు యస్.కె.యాసిన్ బాషా, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధనరావు పాల్గొన్నారు. అదే విధంగా ఎక్కువ కేసులు పరిష్కరించడానికి కృషి చేసిన పోలీస్ సిబ్బందిని జడ్జి అభినందించారు.





# గాల్లో ఎగురుతూ.. గాలికొదిలేశారు?!



మొదటి పేజీ తరువాయి అహంకారం వల్ల రాష్ట్రంలో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనాడు , ఈటీవీ, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చూడొద్దు ఒక సాక్షి మాత్రమే చూడండి అంటూ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు చెప్పటం సిగ్గుచేటన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏమీ చేయలేక పోతున్నామనే బాధ మనసులో ఉందని చెప్పారు. రైతుల ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఏమీ చేయలేననే బాధ ఉన్నా రైతుల పక్షాన నిలబడి న్యాయపోరాటం చేస్తా అన్నారు. రైతు రాజ్యం రావటానికి తెదేపా, జనసేన కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. అరాచక శక్తులు రాజ్యమేలుతున్నప్పుడు రాష్ట్ర ప్రజలంతా ఒకటి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో కక్ష సాధింపు బూతుల పంచాంగం తప్ప ఏమీ లేదని, ప్రజల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఆయన తెలియజేశారు.

### చెరుకూరులో మిర్చి పంటను పరిశీలించిన చంద్రబాబు

### రైతు శ్రీనివాసరావుకు రూ.2 లక్షల సాయం ప్రకటన

చెరుకూరు గ్రామం మీదుగా వెళ్తూ తుపానుకు పంట నీట మునిగి నష్టపోయిన గడ్డం



శ్రీనివాసరావు అనే రైతును చంద్రబాబు పలకరించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న 6 ఎకరాల మిరప తోటను పీకివేస్తున్న శ్రీనివాసరావును చూసి, జరిగిన నష్టాన్ని చూసిన ఆయన చలించిపోయారు. అక్కడికక్కడే రూ.2లక్షల సాయం ప్రకటించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. విపత్తుల సమయంలోనే రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. పొలాల్లోని నీరు బయటకు వెళ్లకపోవడంతో మిరప మొక్కలు కుళ్లిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# గెలిచే వారికే టిక్కెట్ ఇస్తా

### రాష్ట్ర ప్రజలకు తెదేపా అవసరం ఎంతో ఉంది

### నాయకుల పనితీరు బాగోకుంటే ఉపేక్షించను

### ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో చంద్రబాబు



బాపట్ల, మేజర్‌న్యూస్: నేను అంతర్గతంగా చేయించే సర్వేల్లో ఎవరి పనితీరు బాగోకపోయినా ప్రత్యామ్నాయం చూపి పక్కన పెడతా తప్పా, పార్టీ ప్రయోజనాలను ఫణంగా పెట్టనని తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. శనివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల అవకతవకల విషయాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అన్ని పార్టీ అధిష్టానం చూసుకుంటుందనే అలసత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ వద్దని హెచ్చరించారు. గుండ్లకమ్మ వాగు గేటు కొట్టుకుపోయిన అంశాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన జిల్లా నేతలు ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భేటీలో ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, నూకసాని బాలాజీ, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, శ్రీరాం మాల్యాద్రి, బి.ఎన్.విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, గూడూరి ఎరిక్షన్, వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల్లో పేదల్ని ఆదుకోలేని ప్రభుత్వమెందుకు?







### తుపాను బాధిత ప్రాంతాల్లో రెండోరోజు చంద్రబాబు పర్యటన

### బాపట్ల యానాదికాలనీలో బాధిత ప్రజలకు పరామర్శ

### ఇబ్బందులు చెప్పుకుని కన్నీరు మున్నీరైన గిరిజన ప్రజలు

బాపట్ల, మేజర్‌న్యూస్: యానాదుల సంక్షేమం కోసం టీడీపీ అధికారంలోకి రాగానే ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం బాపట్ల యానాది కాలనీలో రెండో రోజు చంద్రబాబు పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రెండు మూడు రోజులు నీళ్లలోనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో యానాదుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. టీడీపీకి ఓటేశారని సంక్షేమ పథకాలు ఆపేశారని చెప్పడం జగన్‌రెడ్డి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. మీకు ఓట్లేయని వారికి సంక్షేమ పథకాలు ఇవ్వరా జగన్ రెడ్డి? టీడీపీ హయాంలో యానాదుల అభివృద్ధికి కృషి చేశామని, విద్య, వైద్యం, ఆరోగ్య పరంగా యానాదులు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. యానాదులకు కూడా ప్రభుత్వం అందరిలాగే 25 కేజీల బియ్యం ఇవ్వటం ఏంటని, కనీసం 50 కేజీలు కూడా ఇవ్వలేరా? ప్రభుత్వం మాటలు చెప్తోంది తప్ప పేదలను ఆదుకోవటం లేదని దుయ్యబట్టారు. బాధితులకు నిత్యావసరాలతో పాటు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తక్షణమే రూ.20వేలు ఇవ్వాలని, విపత్తు సమయంలో పేదల్ని ఆదుకోలేని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. యానాదుల్లో నాయకత్వం పెరగాలని, మీ జీవితాలు మారాలంటే రాజకీయాల్లో కూడా మీ భాగస్వామ్యం ఉండాలని కోరారు. యానాదుల్ని అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటా, ప్రత్యేక ప్రణాళిక రూపొందించి యానాదుల అభివృద్ధికి కృషి చేస్తామని చంద్రబాబు నాయుడు అన్నారు. బాపట్ల నియోజకవర్గ ఇంచార్జ్ వేగేశన నరేంద్రవర్మ, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సీనియర్ నాయకులు ఇనగంటి గాంధీ,







జనసేన జిల్లా నాయకులు శివన్నారాయణ, పార్టీ నాయకులు గొలపల శ్రీనివాసరావు, తాతా జయప్రకాష్ నారాయణ, ఫరీద్ షేక్, షకా, వడ్లమూడి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపిన రజక సంఘం



భట్టిప్రోలు,మేజర్న్యూస్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా రజక సామాజిక వర్గానికి చెందిన వీర్లపల్లి శంకర్ గారు షాద్ నగర్ నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైన సందర్భంగా భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు గ్రామంలో రజక సంఘాల ఐక్యవేదిక యువజన అధ్యక్షులు పోతార్లంక రాజేష్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రజక రామ మందిరం దగ్గర కేక్ కట్ చేస్తూ మిఠాయిలు పంచుకొని రజక సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ఉద్దేశించి పోతాల్లంక రాజేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీల్లో అతి చిన్న కులమైన రజకులను గుర్తించి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి రజకులను గుర్తించినందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పెద్దలు సోనియా గాంధీ గారికి రాహుల్ గాంధీ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చందోల్ రవి, అయినంపూడి నాగేశ్వరావు,గోపి, రాంబాబు, సత్యనారాయణ, శివమణి,శంకర్రావు సుబ్బారావు, సంఘ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నూతన పుస్తకాలు అందజేత



బాపట్ల,మేజర్న్యూస్: తుఫా న్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పాఠశాల విద్యార్థుల పుస్తకాలు తడిసిపోయాయి.తడిచినటువంటి పుస్తకాలకు బదులుగా నూతన పుస్తకాలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యార్థుల ఇంటికి వెళ్లి శనివారం సాయంత్రం పంపిణీ చేశారు. బాపట్ల జిల్లాలోనివేమూరు, బట్టిప్రోలు, కర్లపాలెం ,బాపట్ల మండలంలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాడైపోయినటువంటి పుస్తకాలు బదులు కొత్త పుస్తకాలు పంచిన పంచారు .ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయ రామారావు ,డిప్యూటీ డీఈవో జి వెంకటేశ్వర్లు ,బాపట్ల మండల విద్యాశాఖ అధికారి నిరంజన్, ప్రసాద్ మరియు టెక్ట్స్ బుక్ సెక్రటరీ రవీంద్రనాథ్ రెడ్డి , అదేవిధంగా సమగ్ర శిక్ష ఏ ఎం ఓ బిల్లా మోజేష్ ,డిఇఓ ఆఫీస్ ఏఎస్ఓ సంజయ్ ఏపీఓ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ సిద్ధమైన వికసిద్భారత్ సంకల్పయాత్ర



భట్టిప్రోలు,మేజర్న్యూస్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 15 నుండి జనవరి 26వ తేదీ వరకు వికసిత్ భారత సంకల్ప యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారని,భట్టిప్రోలు మండలంలో కూడా షెడ్యూలు ఖరారయిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుమ్మా చంద్రశేఖర్ శనివారం తెలిపారు.ఈ ఆయన విలేకరులతో మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్పయాత్ర లో ప్రతి గ్రామాన గ్రామ కమిటీలను గ్రామ సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి,వెల్ఫేర్ అసిస్టెంట్లు,డాక్టర్లు, ఉపాధ్యాయులు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు,మహిళా పోలీసు, విలేజ్ సర్వేయర్లు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలను సభ్యులుగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో డిసెంబర్ 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు భట్టిప్రోలు మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ యోజన,దీనదయాల్ యోజన,కిసాన్ క్రెడిట్ కార్డ్,అటల్ పెన్షన్ యోజన,సురక్ష బీమా యోజన,జీవనజ్యోతి బీమా యోజన,జన్ దన్ యోజన వంటి 17 పథకాలను వాటి పనితీరును ప్రజలకు వివరించటం జరుగుతుందన్నారు. కార్యక్రమాలకు నోడల్ ఆఫీసర్లుగా మండల స్థాయిలోని అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిన ది అన్నా రు. ఈ సమావేశంలో మండల పరిషత్ సిబ్బందిపాల్గొన్నారు.

# రైతుల కోసం నిత్యం కృషి చేసే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం

రేపల్లె, మేజర్న్యూస్: రైతుల సంక్షేమం కోసం నిత్యం శ్రమిస్తూ రైతుల పాలిట వరంగా ముఖ్యమంత్రి జగనన్న మారారని పేటేరు పంచాయతీ వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ కనపర్తి రవికిరణ్ అన్నారు. శనివారం ఇటీవల కాలంలో కురిసిన తుఫాను కారణంగా పంట పొలాలు మునిగిపోయి వర్షపు నీరు బయటకు పోవడానికి కాలువలలో ఉన్న పూడికను రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో కాలువ పూడిక తీత పనులు ప్రారంభించామని ఆయన తెలిపారు. ఓలేరు జగనన్న కాలనీ వద్ద నుంచి కారుమూరు రోడ్డు డ్రైన్ వరకు, గౌడ పాలెం వంతెన వద్ద నుంచి ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ వరకు కాలువ పూడిక తీత పనులను కిరణ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ గతంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడ బాధితులకు అందించాల్సిన పరిహారం నెలలను నెలలు గడిపేవారు అని అప్పటికి కూడా జన్మభూమి కమిటీ వారు ప్రతిపాదించిన వ్యక్తులకు మాత్రమే ఆ పరిహారం అందించేవారు అని తెలిపారు.



ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందిస్తున్నామని ఎక్కడ కూడా పార్టీలు కులమతాలకు తావు లేకుండా పరిపాలన కొనసాగిస్తూ అందరికీ పరిహారం అందిస్తున్నామని తెలిపారు. అదే క్రమంలో పశువులను మేపుకొంటూ జీవనం సాగిస్తున్న రైతులకు కూడా మిశ్రమ దాణా ను అందించమన్నారు. జగనన్న రైతుల పక్షపాతి అని మరోసారి రుజువైందని రవికిరణ్ తెలిపారు.

# విద్యార్థులు అంకిత భావంతో చదువు నేర్చుకోవాలి

భట్టిప్రోలు,మేజర్ న్యూస్: విద్యార్థులు అంకిత భావంతో విద్యనభ్యసించాలని,అందుకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని,అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తుందని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శనివారం ఆయన భట్టిప్రోలు మండలం ఆళ్ళమూడి గ్రామంలో పాఠశాలలను సందర్శించారు. తుఫాను ప్రభావం వలన ఆళ్లమూడి గ్రామంలో కొన్ని ఇళ్ళు నీట మునిగి,ఆ ఇండ్లలోని చిన్నారుల పుస్తకాలు తడిసిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు పంపిన నివేదిక ఆధారంగా ఆయన ఆళ్ళమూడి గ్రామాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆ విద్యార్థులకు నూతన పుస్తకాలను అందించడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య ప్రతి ఒక్కరి సామాజిక హక్కు అనిదాన్ని నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు పుస్తకాలు సంబంధిత సామాగ్రి



కొనలేమని తల్లిదండ్రులు అధైర్యపడవలసిన పరిస్థితి ప్రస్తుతం లేదన్నారు.ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్న దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి జె రామారావు మండల విద్యాశాఖ అధికారులు పి లాజరు,ఎన్ దేవరాజ్ గ్రామ సర్పంచ్ రాంబాబు మరియు విద్యాశాఖ సిబ్బంది మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

పెద్ద దోర్నాల, మేజర్న్యూస్: పట్టణంలోని ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఆర్డిటి ఆడిటోరియంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దోర్నాల పెద్దరవిడు మార్కాపురం మండలాల దివ్యాంగులందరూ పాల్గొన్నారు. కార్యక్రమానికి ఐడి సెంటర్ డైరెక్టర్ జులేఖ, ఆర్డి పుష్పలత, ఈ కార్యక్రమంకు ఏరియా టీమ్ లీడర్ వేమయ్య అధ్యక్షతన వహించి ముందుగా ర్యాలీ నిర్వహించారు. తరువాత ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమం మొదలుపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఐడి సెంటర్ డైరెక్టర్ జులేఖ మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులు సకలాంగు లతో సమానంగా అభివృద్ధి చెందాలని ఆర్డిటి సంస్థ ప్రత్యేకంగా మానసిక, మూగ చెవిటి వికలాంగుల కోసం ప్రత్యేక



పాఠశాల ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామస్థాయి లో ఇలాంటి పిల్లల్ని ఎవరైనా ఉన్నట్లయితే సెంటర్ ను సాంప్రదించాలని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ఆర్డి పుష్పలత మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులందరూ గౌరవంగా బ్రతకాలని, ప్రతి ఒక్కరిలో మార్పు కావాలని సమాజంలో అందరు సమానమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, డాక్టర్ శంకర్ రెడ్డి, ఐడిమే నేజర్ నరసింహులు, ఆర్టీసీ ఇన్స్పెక్టర్ బాషా, ఆర్డిటి లీడర్స్, ఆర్డిటి సిబ్బంది సీఓ, ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి దివ్యాంగులు అందరూ పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణం విషయంలో అపోహలు వద్దు

కనిగిరి, మేజర్న్యూస్: దశాబ్దాల కాలంగా అధ్వానంగా ఉన్న కాశీపురం- తుమ్మకుంట రహదారి నిర్మాణంలో స్థలాలు పోతాయని ఎవ్వరూ అపోహ పడవద్దని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ స్థానికులకు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా తారు రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్న తరుణంలో గ్రామస్తులు తమ సొంత స్థలాలు కొంతమేర రహదారి నిర్మాణం వల్ల కోల్పోవలసి వస్తుందని, రహదారి నిర్మాణ విషయంలో సందేహాలు వ్యక్తం చేస్తూ, పనులను నిలిపివేయాలని చూశారు. విషయం తెలుసుకున్న కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆ ప్రాంతానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు లేవనెత్తిన పలు సందేహాలను మున్సిపల్ చైర్మన్ నివృత్తి చేశారు. రహదారి నిర్మాణం సందర్భంగా ఏ ఒక్కరిది గజం స్థలం కూడా ఆక్రమణకు గురికాదని, ఈ విషయంలో సందేహాలు అవసరంలేదని స్థానిక ప్రజలకు భరోసా



కల్పించారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి, నిధులు రాబట్టి, రహదారి నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని. ఈ రోడ్డు పూర్తి అయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాసరి మురళి, మన్సూర్, మాలకొండ రెడ్డి, కోటిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బైకుపై వెళుతున్న వ్యక్తిని బొలెరో వాహనం ఢీ

బేస్తవారిపేట, మేజర్న్యూస్: పట్టణంలోని మెయిన్ రోడ్‌లో శనివారం ఉదయం అనంతపూర్ టు అమరావతి నేషనల్ హైవేపై బేస్తవారిపేట



బస్టాండ్‌లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని బొలెరో వాహనం ఢీకొనడంతో బైక్ పై ఉన్న వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పూసలపాడుకు చెందిన బాల్ రెడ్డి(అగ్రిగోల్డ్) గుర్తించారు.

## పంట పొలాలు పరిశీలించిన మంత్రి నాగార్జున



చుండూరు(భట్టిప్రోలు) మేజర్న్యూస్: చుండూరు మండల పరిధిలోని మోదుకూరు గ్రామములో మిచౌంగ్ తుఫాను ప్రభావంతో నీట మునిగిన వరి పంట పొలాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధములుగా ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలు వచ్చేలా తగిన న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మోదుకూరు వీరారెడ్డి, రఘు రామ రెడ్డి,ఆళ్ల వెంకట రమణారెడ్డి, సుబ్బారెడ్డి,ఆళ్ల శ్రీధర్ రెడ్డి, రైతులు,పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో స్వామి వారికి లక్ష బిల్వార్చన



భట్టిప్రోలు, మేజర్న్యూస్: మండలంలోని అద్దేపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాస పర్వదినాల సందర్భంగా శనివారం లక్షబిల్వాచన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.స్వామివారి పూజలో మద్దుల శివరామ సుబ్రహ్మణ్యం-లక్ష్మీ ప్రియ, మద్దుల గోవిందరాజులు -లక్ష్మీకుమారి, మద్దుల శివప్రసాద్-జయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. పూజలనుదేవాలయ అర్చకులు మురికిపూడి దుర్గాప్రసాద్ శర్మ,దండిభట్ల సాయి దండిబట్ల కనక సుందరశర్మ,దండిభట్ల మురళి పూజలు జరిపించారు.ఈ కార్యక్రమాలనుదేవాలయ కమిటీ అధ్యక్షులు మద్దుల రాంప్రకాష్ తదితర సభ్యులు పర్యవేక్షించారు.

## సెంటర్ ఫర్ క్రియేటివ్ ఆర్ట్స్ ప్రారంభోత్సవ వేడుకలు

బాపట్ల,మేజర్న్యూస్:బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులచే నిర్వహించుచున్న సెంటర్ ఫర్ క్రియేటివ్ ఆర్ట్స్ వారు 14వ వార్షిక ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించారు . ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వివిధ కళలలో నైపుణ్యం పెంపొందించుటకు సీసీఏ ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ సాంస్కృతిక మరియు సామాజిక కార్యక్రమాలో పాలుపంచు కోవడానికి కళాశాల సర్వతో ముఖాబి. వృద్ధిగా తోడ్పడుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో విద్యార్థులు డాన్స్ , సింగింగ్ ,ఆర్ట్స్ మరియు డ్రమ్మెటిక్స్ లో వారి యొక్క నైపుణ్యాలను ప్రదర్శిం చారు . ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి. నిరంజన్ బాబు ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా సర్పంచుల సమస్యలపై పోరాటం చేయాలి

మార్కాపురం, మేజర్‌న్యూస్: రాష్ట్ర వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్నటు వంటి గ్రామ సర్పంచ్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మార్కాపురం సర్పంచ్‌ల సంఘం నాయకులు శనివారం స్థానిక ఆర్ అండ్ బి బంగళా ఆవరణలో సమకూడి డిమాండ్ చేశారు. గ్రామ సీమలే దేశానికి పట్టుకొమ్మలని, కానీ నేడు అటువంటి గ్రామాలు సమస్యలతో కునారిల్లుతూ సర్పంచుల హక్కులను కూడా కాలరాస్తూ సరైన నిధులు సమకూడక ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా అభివృద్ధికి నోచుకోక సర్పంచుల హక్కులు కూడా హరించి పోతున్నాయని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ సభ్యులు అంటూ ఒక పార్టీకి కొమ్ముకాస్తూ సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తే సహించమని పార్టీలకతీతంగా సర్పంచుల సమస్యలపై ఐక్యంగా పోరాటం చేస్తే అందరం కలిసి సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఏ ఒక్క పార్టీకి వత్తాసు పలుకుతూ మరో పార్టీని దూషిస్తూ సర్పంచుల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని వారు ఈ సందర్భంగా నాయకుల చర్యలను ఖండించారు. ఒక పార్టీ రంగు పూసుకొని సర్పంచ్‌ల సంఘ నాయకులమని మరోసారి మార్కాపురం ప్రాంతంలో తిరిగే నాయకులకు బుద్ధి చెబుతామని అన్నారు. అందరం కలిసి ముందుకు కదలి మన సమస్యలను పరిష్కరించుకొందామని గ్రామాలలో సమస్యలు లేకుండా మంచి పరిపాలనను అందించిన సర్పంచులుగా గుర్తింపు పొందుతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సర్పంచ్ దయ్యాల నాధగురుబ్రహ్మం, భూపతిపల్లి సర్పంచ్ మున్నంగి కోటేశ్వరి లాజరు, కొలభీమునిపాడు సర్పంచ్ చిట్యాల సుబ్బారెడ్డి, ఇమ్మడి శ్రీరాములు, డి.వెంకటేశ్వర రెడ్డి, కె.బాలమ్మ, వి.వెంకటేశ్వర్లు, గోపిరెడ్డి, శ్రీను, టి.రమణమ్మ వెంకటేశ్వర్లు, నాగరాజు సుబ్బారెడ్డి తదితర సర్పంచులు పాల్గొన్నారు.



## నూతన ఎస్ఐ కోటయ్యను కలిసిన టిడిపి నేతలు

పీసీపల్లి, మేజర్‌న్యూస్: ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన జి.కోటయ్యను టిడిపి మండల అధ్యక్షులు వేమూరి రామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రగొండపాలెం నుంచి బదిలీ మీద పీసీపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా శనివారం సాయంత్రం కలిసి శాలు వాలతో ఘనంగా సత్కరిం చారు. విధి నిర్వహణలో విశేష సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు ఏనుగుంట నాగేంద్రబాబు, క్లస్టర్ ఇంచార్జి మూలె సత్తిరెడ్డి, యూనిట్ ఇన్చార్జి ముప్పవరపు మాచర్ల పాల్గొన్నారు.



## ఆడుదాం ఆంధ్ర కిట్లు పంపిణీ

మార్కాపురం, మేజర్‌న్యూస్: ఆడుదాం ఆంధ్రలో భాగంగా శనివారం మార్కాపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్



అధ్యక్షురాలు పొరెడ్డి అరుణ చెంచిరెడ్డి చేతుల మీదుగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో కుమారి తోట చందన కలసి ఆటల కిట్లను పంపిణీ చేయుట జరిగినది. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరకొండలో మొక్కులు తీర్చుకున్న కొటికలపూడి తెదేపా నేతలు

అద్దంకి, మేజర్ న్యూస్: మండలంలోని కొటికలపూడి గ్రామపంచాయతీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నేతలు సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం మొక్కులు తీర్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని అక్రమంగా జైలులో పెట్టిన సమయంలో తమ నాయకుడు త్వరగా బయటకు రావాలని



గ్రామానికి చెందిన పలువురు నాయకులు మహిళలు మొక్కుకున్నారని గ్రామ సర్పంచ్ పూనాటి విక్రం తెలిపారు. కొద్దిరోజుల క్రితం బెయిల్ పై తమ నేత బయటకు రావడంతో గ్రామానికి చెందిన పార్టీ నాయకులు మహిళలు చిన్నారులు భారీ స్థాయిలో గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరి సింగరకొండ చేరుకున్నారు. ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మొక్కులు చెల్లించుకున్నారు. చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్ర ద్వారా సింగరకొండకు బయలుదేరిన నాయకులకు, మహిళలకు, చిన్నారులకు భవాని సెంటర్ వద్ద స్థానిక తెదేపా నేతలు సంఘీభావం తెలిపారు.

## అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్స్ పోస్టులకు ఆహ్వానం

ఉలవపాడు, మేజర్‌న్యూస్: నెల్లూరు జిల్లా ఉలవపాడు ఐ.సి.డి.యస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్త,రెండు హెల్పర్స్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సి.డి.పి.ఓ బి.విజయ కుమారి శనివారం తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలోని లింగసముద్రం మండలం చినపవని గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త పోస్టు-1 జనరల్,అదే మండలం తిమ్మారెడ్డి పాలెం గ్రామపంచాయతీలోని గంగపాలెంలో హెల్పర్ పోస్టు-1 జనరల్, ఉలవపాడు-2లో హెల్పర్ పోస్ట్-1జనరల్, ఈ నెల9 నుంచి 19వ తేదీ లోపు ఆయా సచివాలయాల పరిధిలో ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సి.డి.పి.ఓ కోరారు. అభ్యర్థులు10వ తరగతి ఉత్తీర్ణులై, 21నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారై ఉండాలి, స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలని ఆమె తెలిపారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

### - విద్యార్థులకి నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ

తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన ఎస్సీ హాస్టల్ నందు జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కైపు వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను అంగరంగ



వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కైపు వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకి నోటు పుస్తకాల్లో మరియు పండ్లను పంపిణీ చేసి దేశంలో పేదలకి, బడుగు బలహీన వర్గాలకి, మైనార్టీలకి, పేద రైతులకి కాంగ్రెస్ ప్రభుత్వం సోనియమ్మ ఆధ్వర్యంలో ఎన్నో మేలు చేసిందని ఎంతో అభివృద్ధి చేసిందని ఇవన్నీ గుర్తు చేసుకుంటూ ఆమె జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు దేసు చలపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వికసిత భారత్ సంకల్ప యాత్రలో బీజేపీ నాయకులు

కంభం, మేజర్‌న్యూస్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షులు పి.వి.శివారెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు అసెంబ్లీ పరిలో ఉన్న కంభం మండలం ఎర్రబలెం గ్రామంలో శనివారం జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్ శంకర్, గిద్దలూరు



పట్టణ బీజేపీ కార్యదర్శి ఎం.వి. రమణ,గిద్దలూరు పట్టణ బీజేపీ కార్యదర్శి పుట్ట రమేష్ కుమార్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయని ముఖ్యంగా ప్రధాని ఆవాస యోజన పథకం క్రింద సొంత ఇంటి కల నెరవేరేలా ప్రధాన మంత్రి ఈ పథకం ఉపయోగ పడుతుందని అలాగే ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ వుందని, జల జీవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఉచితంగా యివ్వడం జరుగుతుందని, 28 కోట్ల మహిళా జన్ దన్ ఖాతాలు తెరిపించడం జరిగింది. స్వచ్ భారత్ మిషన్ క్రింద 11.74 కోట్ల మరుగు దొడ్డు నిర్మాణం జరిగిందని అన్ని పథకాలు అర్హులు లబ్ది పొందాలని కోరడం జరిగింది.



## సైకిల్‌పై శబరిమల యాత్ర

తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో దర్శి రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానం నుండి గంగవరం గ్రామానికి చెందిన గుజ్జుల వెంకటేశ్వర్ రెడ్డి ఫర్నిచర్ రాము సైకిల్ పై శబరిమలకు బయలుదేరారు ఆలయ గురుస్వామి ఆలయ పండితులు డాక్టర్ స్వామి ఇరుముడి కట్టారు. గురుస్వాముల గుద్దేటి సుబ్బారెడ్డి స్వామీ, యర్రపు రెడ్డీ స్వామియాత్రను ప్రారంభించారు స్వామియే శరణమయ్యప్ప అంటూ సైకిల్ తొక్కుతూ స్వామివారి సన్నిధానానికి స్వాములు బయలుదేరి వెళ్లారు.

## సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజా సంక్షేమం

### - ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆవుల రమణమ్మ

పామూరు, మేజర్‌న్యూస్: నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని తిరగలదిన్నె బూత్ ఇంచార్జ్ ఆవుల రమణమ్మ అన్నారు. మాజీ ఎమ్మెల్యే



తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపు మేరకు టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు నేతృత్వంలో మండలంలోని తిరగలదిన్నె గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలిపి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి మల్లెల గురు బ్రహ్మయ్య, మల్లెబోయిన కృష్ణయ్య, హనీఫ్, పాడె నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# రెండు టీఎంసీల నీరు సముద్రం పాలు

## నైతిక బాధ్యతగా నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాజీనామా చేయాలి

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా



పొదిలి, మేజర్ న్యూస్ : మల్లవరం కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు శుక్రవారం రాత్రి రెండో గేటు కొట్టుకొని పోయి రెండు టీఎంసీల నీరు సముద్ర పాలు కావడం బాధాకరమని, నీటి ప్రాజెక్టులు నిర్వహణలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని దీనికి నైతిక బాధ్యతగా రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టు 31న మూడో గేటు కొట్టుకొని పోయిందని ఇప్పటికీ సుమారు ఏడాదిన్నర కావస్తుందని దానికి మరమ్మత్తులు చేయడంలో కొత్త గేటు బిగించడం లో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్వహణ కాకుండా కనీసం గ్రీసు కూడా పూసే పరిస్థితి ఇరిగేషన్ శాఖ వద్దలేదని ఆయన విమర్శించారు. గుండ్లకమ్మ జలాశయం కింద కుడి ఎడమ కాలువల పరిధిలో దాదాపు 80 ఎకరాల ఆయకట్టు ఉందని, రిజర్వాయర్ లో చేపల వేటతో 2000 పైగా మత్స్యకార కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని ఇలాంటి ప్రాధాన్యత గల రిజర్వాయర్ను ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మించి 15 ఏళ్లు పూర్తి కాకముందే నిర్వహణ వైఫల్యం మూలంగా గేట్లు తుప్పు పట్టి పోయాయని, మొత్తం 15 గేట్లలో చాలావరకు పాడైపోయాయని వాటిని మార్చాలని మూడేళ్ల కిందటే నిపుణులు ప్రభుత్వానికి నివేదించారని, ముఖ్యంగా 6,7 నెంబర్ గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వాటి తక్షణమే మరమ్మత్తులు చేయాలని నిపుణుల కమిటీ ప్రభుత్వానికి సూచించింది మొత్తానికి మూడు కోట్ల రూపాయలతో మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని కేవలం 98 లక్షల మాత్రమే మంజూరు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు.

గత ఏడాది ఆగస్టు 31 రాత్రి మూడో నెంబర్ గేటు కొట్టు పోయిందని, సాఫ్ట్ లాక్ గేటు పెట్టే లోపే ప్రాజెక్టులోని నీళ్లన్నీ వృధాగా సముద్రంలో కలిసిపోయాయని ఆయన అన్నారు, తరువాత కేంద్ర ఆకృతుల సంస్థ అధికారులు ప్రాజెక్టును సందర్శించి మొత్తం గేట్లు బాగు చేయాలని తేల్చి చెప్పారు 9.4 కోట్ల రూపాయలు అంచనాలతో ప్రభుత్వానికి ప్రతి పా ధనలను పంపారనీ ,కానీ ఇప్పటివరకు మొదటిసారి కొట్టుకుపోయిన గేటు మరమత్తులకే దిక్కు లేదన్నారు.



## సకల మాలధారణ స్వాములకు అన్నదానం ఏర్పాటు చేసిన సుదాకర్‌రెడ్డి

పొదిలి,మేజర్‌న్యూస్: స్థానిక నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో శనివారం సకల మాలధారణ స్వాములకు పులిచర్ల సుధాకర్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ సంధర్భంగా సుదాకర్‌రెడ్డి ,ఆయన తండ్రి పులిచర్ల వెంకటేశ్వరరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. సకల మాలధారణ స్వాములకు అన్నదానం చేసిన సుధాకర్‌రెడ్డిని అయ్యప్ప స్వామి దేవస్థాన పూజారి మురళి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గురుస్వామి గొలమారి చెన్నారెడ్డి,శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలో ఇటీవల తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రతిరైతుకూ న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించాలని యంపిపి మూడమంచు వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగినది. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ఇటీవల తుఫాన్ కారణంగా మండలంలో వివిధ పంటలకు తీవ్రనష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి, సిబ్బంది క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనావేసి ప్రభుత్వం ద్వారా



నష్టపరిహారం అందించాలని అదేవిధంగా గ్రామాలలో రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు సకాలంలో అందించి ప్రభుత్వ రైతుసంక్షేమ పథకాలు వివరించి అర్హులైన ప్రతిరైతుకు లబ్ధిచేకూర్చాలని రైతులకు అందుబాటులో ఉండి పంటలను పరిశీలించి తెగుళ్ళు నివారించి అధిక దిగుబడి సాధించి రైతులు ఆర్థిక సంక్షేమ అభివృద్ధికి వ్యవసాయ సిబ్బంది కృషిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షుడు మూడమంచు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారిణి కె.రాధ, వైసీపీ జిల్లాకార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, సర్పంచులు చిరంజీవి, ప్రవీణ్,యంపిటిసి తిరుపాలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్విస్‌లో రైజింగ్ ఆఫ్ ఎన్‌సిసి ట్రూప్

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఎన్సిసి స్టాఫ్ చేతులు మీదుగా రిబ్బన్ కట్ చేసి కార్యాలయమును ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా క్విస్ కాలేజ్ ఎన్సిసి మెయిన్ ఆఫీసర్ రిటైర్డ్ కెప్టెన్ వైవి రమణయ్య పాల్గొన్నారు. హవెల్దార్ జై క్రిషన్ తపా, హవెల్దార్ ఎస్.శ్రీనివాసులు, శ్రేష్ట పాల్గొని ఎన్సిసి ఆంధ్ర బెటాలియన్ ట్రూప్‌ను పాఠశాల నందు ప్రారంభించారు. 34 ఎన్సిసి



బెటాలియన్ నందు 25 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ క్రమంలో ముఖ్య అతిథులు ఎన్సిసి ప్రాధాన్యత వివరిస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ వారి పిల్లలను ఎన్సిసి నందు చేర్పించుటకై పిల్లలను ప్రోత్సహించాలి. క్విస్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సూర్య కళ్యాణ చక్రవర్తి పాల్గొని విద్యార్థులను ప్రశంసించారు. క్విస్ పాఠశాల ప్రిన్సిపల్, కె.నాగరాజు, ఎ.ఎం.జి.స్వాతి, ఎన్సిసి కేర్ టేకర్ బి.రమాదేవి ఆధ్వర్యంలో, ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు అందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## పేస్‌లో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



టంగుటూరు, మేజర్‌న్యూస్: ఏఐసిటిఈ న్యూఢిల్లీ, అటల్ వారి సహకారంతో స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి 'ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం ఆన్ ఎమర్జింగ్ రీసెర్చ్ ఏరియా ఇన్ వియల్ ఎస్ఐ సిస్టం డిజైన్ అండ్ ఛాలెంజెస్ సెమికండక్టర్ టు ఎండ్ అప్లికేషన్ అప్రోచ్' శనివారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.జివికె మూర్తి మాట్లాడుతూ ఏఐసిటిఈ న్యూఢిల్లీ, అటల్ ఈ కార్యక్రమానికి స్పాన్సర్స్‌గా ఉండి పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని అనుమతించడం తమ కళాశాల స్థాయిని మరో స్థాయిలో ఉండేలా చేసిందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి, డీన్ అకడమిక్స డా.యం.అప్పారావు, కార్యక్రమ, అసోసియేట్ డీన్స్, ఆర్‌యండి టీం, ఐక్యూఎసి టీం, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## మనుషుల ప్రాణాలు పోతే గానీ విద్యుత్ అధికారులు స్పందించరా

పొదిలి,మేజర్‌న్యూస్: మనుషుల ప్రాణాలు పోతే గానీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించరా అని మాజీ ఉప సర్పంచ్ షేక్ జిలానీబాష ఆవేదన వ్యక్తం చేశారు. స్థనిక మసీదుతోలో గత ఎంతో కాలంగా లోఓల్టేజి సమస్య వేధిస్తుందని,దీనికి తోడు విద్యుత్ కేబుల్ వైర్లు సరిగా లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగు తుందోనని ప్రజలు భయా ందోళన చెందుతున్నారన్నారు. ఈ విషయంపై తాను గతంలో స్పందనలో అర్జీ ఇచ్చినప్పటికీ నేటికి ఆ సమస్య పరిష్కారం కాలేదని జిలానీబాష విద్యుత్‌శాఖ అధికారుల తీరుపట్ల మండిపడ్డారు. శనివారం మసీదుతోట లో అగస్మాత్తుగా విద్యుత్ తీగ తెగిపడిందని,ఇది గమనించిన అక్కడ ఉన్న ప్రజలు పరుగులు తీయంతో పెను ప్రమాదం తప్పిందన్నారు .పాలెంలో సుమారు 10 వరకు ఇనుప స్థంబాలు ఉన్నాయని వర్షం



సమయంలో స్థంబాలకు విద్యుత్ ప్రవహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు మొద్దు నిద్రను వీడి మసీదుతోటలో నెలకొన్న విద్యుత్ సమస్యను,ఎలాంటి ప్రాణ నష్టం జరగక ముందే పరిష్కరించాలని జిలానీబాష డిమాండ్ చేశారు. లేకుంటే అధికారులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## వాహనదారులు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**– ఓవర్‌లోడ్‌తో వెళుతున్న 5 వాహనాలపై కేసులు**

**– రూ.30 వేల జరిమానా విధించిన దర్శి ఆర్టీవో రవికుమార్**

పొదిలి,మేజర్‌న్యూస్: వాహనదారులు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దర్శి ఆర్టీవో పి రవికుమార్ హెచ్చరించారు. శనివారం పొదిలి,కనిగిరి రోడ్డులో ఓవర్‌లోడ్‌తో వెళుతున్న 5 వాహనాలపై ఆయన కేసులు నమోదు చేసి రూ. 30 వేల జరి మానా విధించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి,



సెల్‌ఫోన్ మాట్లాడుతూ,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి, పర్మెంట్, ఇన్స్యూరెన్స్, ఫిట్‌మెంట్ పత్రాలు దగ్గరుంచుకోవాలన్నారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## ఆంజనేయస్వామిదేవస్థానంలో విశేషపూజలు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని సీ.నాగులవరం గ్రామానికి సమీపంలో అతిపురాతన మహిమాన్విత శక్తివంతమైన శ్రీవీరభద్ర సమేత ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం సింధూర అర్చన నిర్వహించి అనంతరం పూలమాలలు పట్టువస్త్రాలతో అలంకరణ చేసి ఆకుపూజ,గారెపూజ, వివిధ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్తీకమాసం శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని దేవస్థానం ఆవరణలో కార్తీకదీపాలు వెలిగించి స్వామివారిని దర్శిం చుకుని పూజలుచేసి నైవేద్యాలు సమర్పించారు. అదేవిధంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా



దేవస్థానం చైర్మన్ యం.మొరార్జీ, సర్పంచ్ ముప్పాళ్ళ సరోజనమ్మ ఆంజనేయ వసంతరాజు, ట్రస్టుబోర్డు సభ్యులు చిట్లానరసమ్మ కుటుంబసభ్యులు పర్యవేక్షించి వసతులు కల్పించారు. భక్తులకు గుంటూరుకు చెందిన బ్యాంకు ఉద్యోగి యం.మురళీధర్ నాయక్ శ్రీమతి సాయిశ్వేత దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు వెంకటరాజు, చిట్లా నరసమ్మ, కుటుంబ సభ్యులు చిట్లాహరి నారాయణ భాగ్యలక్ష్మి, చిట్లా శివకుమార్, పలువురు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: గుడ్ న్యూస్ అందుల పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చీరాలకు చెందిన యాదవ సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా వారి కుమార్తె కుమారులు అంధులైన పిల్లలకు చలికి సరిపోయే మంచి బెడ్ షీట్స్ అందించారు. కొన్ని దైవ భక్తి కీర్తనలు పాడి అందులో అందరిని అలరించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణ మోహన్ రావు అధ్యక్ష వహించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమానికి యాదల వాణి సిఏఓ,



వై.అనిల్ కుమార్ టీచర్, టీ.ప్రభాకర్, కే.సుధాకర్, డిఎస్పి ఏ.సృజన టీచర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వై.వాణి ఎంతో ఆహ్లాదకరంగా నడిపించారు. చివరగా అందులకు స్వీట్స్ పంచిపెట్టారు.

## నేడు జనసేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

కొండపి, మేజర్‌న్యూస్: టంగుటూరు నుండి కొండపి వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా గుంతలగుంతలుగా మారి ప్రయాణికులు యాక్సిడెంట్లకు గురి అవుతున్నారు తరుణంలో ఈ ప్రధాన రహదారిని మరమ్మత్తులు చేయాలని జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఈనెల 10 తేది ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కొండపి నియోజవకర్గం జనసేన సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు ప్రతి ఒక్కరు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేసిన సర్పంచ్ వీరమల్లు

కందుకూరు, మేజర్‌న్యూస్: మండలంలోని పలుకూరు గ్రామంలో సర్పంచ్ వీరమల్లు శ్రీను ఆధ్వర్యంలో గత 3 రోజుల నుండి పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు గ్రామంలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాల మేరకు అన్ని చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లడం, కాలువలోని పుడికలను తీయడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అని ఆయన అన్నారు. గ్రామ ప్రజలు పారిశుధ్య కార్మికులకు సహకరించి, వ్యాధులు ప్రబలకుండా తీసుకునే జాగ్రత్తలు పాలుపంచుకోవాలని ఆయన తెలిపారు.



పంచాయతీలో ఎక్కడైనా పారిశుధ్య పనులు జరగనీయడల నేరుగా నా దృష్టికి తీసుకుని రావాలని ఆయన అన్నారు. ఎక్కడైనా మన మత్తుకు గురైనా, పారిశుద్ధ్య కార్యక్రమాల తదితర సమస్యలను వాలంటీర్లు గుర్తించి సచివాలయ అధికారులకు సమాచారం అందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన అన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

చీరాల, మేజర్ న్యూస్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు జన్మదిన వేడుకను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంచార్జి దేవరపల్లి రంగారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద శనివారం దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన నివాళి అర్పించి, సోనియా గాంధీ జన్మదిన కేక్‌ను కట్ చేసి, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా దేవరపల్లి రంగారావు



మాట్లాడుతూ దేశ ప్రజల కోసం తమ కుటుంబాన్ని సైతం లక్ష్యపెట్టక ప్రజల పక్షాన నిలబడిన త్యాగశీలి సోనియా గాంధీ అని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ మరణించినప్పటికీ తమ పిల్లలకు ప్రాణ హాని ఉందని తెలిసినా కూడా దేశం కోసం ధైర్యంతో నిలిచిన మహోన్నత పాలకు రాలు సోనియా గాంధీ అని ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లో దేశ ప్రజల మన్ననలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాహూల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐనంపూడి అఖిల్, పేర్లి బుజ్జిరాజు, రహమత్ అలీ, కర్రెద్దుల సురేష్, మేరుగ రమేష్‌బాబు, జూటూరి కుమార్, దాసి పీటర్, రమేష్, పందరబోయిన సుబ్రమణ్యం, యర్రాకుల శ్రీనివాసరావు,యెనుముల సూర్య ప్రదీప్, పీటర్ రమేష్, షేక్ మస్తాన్ వలి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాణ్యత కల్గిన ఆహారం అందించాలి

చీరాల రూరల్, మేజర్ న్యూస్: బిర్యానీ ప్రియులకు నాణ్యత కల్గిన ఆహారాన్ని రెడ్ బకెట్ బిర్యానీ పాయింట్ నిర్వాహకులు అందించాలని శాసన సభ్యుడు కరణం బలరాం కృష్ణమూర్తి సూచించారు. స్థానిక పేరాల పాత పోస్టాఫీసు వద్ద శనివారం నూతనంగా నిర్మాణం చేపట్టిన రెడ్ బకెట్ బిర్యానీ పాయింట్‌ను ప్రారంభోత్సవానికి కరణం బలరాం ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిర్యానీ పాయింట్‌ను ప్రారంభించి, నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జంజనం శ్రీనివాసరావు, గవిని శ్రీనివాసరావు, బొనిగల జైసన్ బాబు, కోంద్రు బాబ్జి, ఆసాది అంకాలరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఐకమత్యంతో మన హక్కులను మనమే సాధించుకోవాలి







యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: వికలాంగులు ఐకమత్యంతో కలిసి కట్టుగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య పిలుపు నిచ్చారు. శనివారం నాడు ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థ ఏరియా టీమ్ లీడర్ గిరిజా ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 64వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి ఆర్‌డిటి దివ్యాంగుల గ్రూప్ ఆర్గనైజర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ వికలాంగులు రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను వినియోగించు కోవాలని కోరారు. ట్రైసైకిల్స్, కృత్రిమ అవయవాలు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు,వీల్ చైర్లు,అంధుల చేతి కర్రలు, పొందాలని తెలిపారు. 2016 చట్టంపై అవగాహన పెంచుకొని హక్కుల ను సాధించుకునేందుకు సంఘీటిత శక్తిగా తయారు కావాలని ఆకాంక్షించారు. దోర్నాలలో వున్న దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగ బాల బాలికలను చేర్చాలని కోరారు. చెంచు గిరిజనుల మాదిరిగానే వికలాంగులకు కూడా పక్కా గృహాలు, మరుగుదొడ్లను కట్టించి ఇవ్వాలని సంస్థ అధికారులను కోరారు. ముందుగా అంబేద్కర్ ఆడిటోరియం నుంచి మార్కాపురం- మాచర్ల రహదారిలో అంతతర్జాతీయ వికలాంగుల దినోత్సవ ర్యాలీ చేపట్టారు. మీ జాలి మాకొద్దు - సహకారం అందించండి, దివ్యంగుల పట్ల వివక్షత వద్దు, విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలని వారు అన్నీ రంగాలలో రాణిస్తారని నినాదాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి అధికారులు జులేఖ, ఆర్‌డిటి వికలాంగుల జాబ్స్ మేనేజర్ సుధీర్, అంధ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బూదాల చిన్నయ్య, ఆర్‌డిటి యర్రగొండపాలెం నియోజకవర్గ అధ్యక్షులు పి.పెద్ద పాలంకయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కే.కోటేశ్వరరావు, ఆర్‌డిటి గ్రూప్ ఆర్గనైజర్లు, సిబ్బంది యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల నుంచి యాక్టివ్ లీడర్లు 200 మంది వికలాంగులు పాల్గొన్నారు.

## రమణారెడ్డికి కరణం బలరాం పరామర్శ

చీరాల రూరల్, మేజర్ న్యూస్: శాసన సభ్యుడు కరణం బలరాం ఆర్‌బికె ఛైర్మన్ కావూరి రమణారెడ్డిని పరామర్శించారు. మండలంలోని కావూరివారిపాలెం గ్రామం లోని రమణారెడ్డి నివాస గృహానికి శనివారం కరణం బలరాం హాజరై రమణారెడ్డి ని పరామర్శించారు. ఈ సందర్భంగా కరణం బలరాం కావూరి



రమణారెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్‌బాబుతో కావూరి రమణా రెడ్డి వీడియా కాల్ మాట్లాడి ఒకరి ఆరోగ్య పరిస్థితి గురించి ఒకరు అడిగి తెలుసుకుని, కుసుల ప్రశ్నలు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జంజనం శ్రీనివాసరావు, గవిని శ్రీని వాసరావు, ఆసాది అంకాలరెడ్డి, కావూరి యలమందారెడ్డి, బుర్ల సాంబశివరావు, పిట్టు పోలయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు.

## నష్టపోయిన పంటల పరిశీలన: కరణం బలరాం

చీరాల రూరల్, మేజర్ న్యూస్: మిచౌంగ్ తుఫాను కారణంగా నియోజకవర్గంలో నష్ట పోయిన రైతుల పంట పొలాలను శాసన సభ్యుడు కరణం బలరాం పరిశీలించారు. మండలంలోని బోయినవారిపాలెం, దేవినూతల, కావూరివారిపాలెం, గవినివారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, తోటవారిపాలెం గ్రామాలలోని రైతుల పంట పొలాలను నాయకులు మరియు అధికారులతో కలిసి శనివారం కరణం బలరాం పరిశీలించారు. ఈ సందర్భంగా



కరణం బలరాం రైతులకు ధైర్యం చెబుతూ తుఫాను కారణంగా నష్టపోయిన ప్రభుత్వం నుంచి రావల్సిన పరిహారాన్ని అందజేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జంజనం శ్రీనివాసరావు, గవిని శ్రీనివాసరావు, ఆసాది అంకాలరెడ్డి, బోయిన కేశవులు, బిట్ర శ్రీనివాసరావు, పృధ్వి ధనుంజయ్, చప్పిడి రామచంద్రరావు, కోటి రవి, ఎర్రాకుల శ్రీను, కావూరి యదాలరెడ్డి, పిట్టు నాగిరెడ్డి, పాలిబోయిన పెద్ద అంకిరెడ్డి, దరబడి సురేష్, గవిని సాంబయ్య, గవిని ప్రసాద్, గవిని కోటేశ్వరరావు, బుర్ల మురళీకృష్ణ, పిట్టు పోలయ్య, బుర్ల చిన్న వెంకటేశ్వర్లు, బుర్ల సాంబశివరావు, దేవరపల్లి అబ్రహాం, బొంతగర్ల రాధా కృష్ణ, మల్లారపు ఏసురత్నం, నాదెండ్ల కోటేశ్వరరావు, బక్కా అద్దంకి రెడ్డి, ముచ్చు దేవేంధ్ర, అగ్రికల్చర్ ఏడీ ఎఫ్రైమ్, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ ప్రాంతంలో పైరిథ్రిన్ స్ప్రే

చీమకుర్తి, మేజర్‌న్యూస్ః జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు చీమకుర్తి మండలంలోని బూదవాడ పరిధిలో కంకర మిల్లులో పనిచేసే కార్మికుడికి డెంగీ నిర్ధారణ కావటంతో ఆ ప్రాంతంలో వైద్యఆరోగ్య సిబ్బంది శనివారం పైరిథ్రిన్ స్ప్రే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివరాలు బూదవాడ ప్రాంతంలోని జనార్ధన్ క్రషింగ్ మిల్లులో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కార్మికుడు బి.ప్రధాన్ వైద్య పరీక్షల కోసం ఒంగోలు రిమ్స్‌కు వెళ్లగా అక్కడి వైద్యులు డెంగీ వ్యాధిగా నిర్ధారించారు. వెంటనే సమాచారం అందుకున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డెంగీ నమోదు అయిన బూదవాడ ప్రాంతంలోని జనార్ధన్ క్రషింగ్ మిల్లు



వద్దకు చేరుకొని కార్మికుడు నివసించే ప్రాంతంలో దోమల నిర్మూలనకు మరియు దోమల లార్వా నిర్మూలనకు పైరిథ్రిన్ స్ప్రే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ.(కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్) మాధవరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పి.హెచ్.సి.డాక్టరు.జి.కమల పర్యవేక్షించారు.

## కౌలు రైతులను కూడా ఆదుకోవాలి

చీరాల, మేజర్ న్యూస్: మిచౌంగ్ తుఫాను కారణంగా నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య సూచించారు. మండలంలోని గవినివారిపాలెం గ్రామంలో శనివారం సిహెచ్ గంగయ్య సీపీఎం నాయకులతో పాటుపర్యటించి తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించి, పంట పొలాలను



పరిశీలించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ప్రతి రైతు ఎకరాకి ఇప్పటి వరకు 15వేల నుంచి 25 వరకు వ్యవసాయం పై పెట్టుబడి పెట్టారని గుర్తు చేశారు. రైతులకు ఇంత నష్టం జరిగినా అధికారులు పట్టించుకోలేదని, రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని మండి పడ్డారు. నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేంత వరకు సీపీఎం పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని రైతులకు ధైర్యం పలికారు. ఈ కార్యక్రమంలో బాబురావు, పి కొండయ్య, సుధాకర్, సుందరయ్య తదితర సీపీఎం నాయకులు పాల్గొన్నారు.






# శోభాయమానంగా శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం

**శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవంలో మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, టీటీడీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు శిద్దా సుధీర్ కుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు**

**పెద్దసంఖ్యలో పాల్గొన్న సర్వ దీక్షా స్వాములు, భక్తులు**

**జ్యోతి ప్రదర్శనలో చిన్నారి భక్తులు - అయ్యప్పస్వామి శరణు ఘోషతో నగరోత్సవం**

చీమకుర్తి, మేజర్‌న్యూస్: శ్రీహరిహర క్షేత్రంలో శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి అభిషేకాల కార్యక్రమం శనివారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శ్రీమతి శిద్దా లక్ష్మీ పద్మావతి దంపతులు, కుటుంబ సభ్యులు, శిద్దా పాండురంగారావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు క్షేత్రంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిహర క్షేత్రంలో అయ్యప్ప స్వామి అభిషేకంలో. భాగంగా శనివారం ఉదయం శ్రీ అయ్యప్పస్వామి వారికి మహాగణపతిపూజ, గంగపూజ, మండపారాధన మహన్యాసక పఠనం,ఆదిత్యాధి నవ గ్రహపూజ అనంతరం అయ్యప్పస్వామి వారికి అభిషేకాలు, అష్టోత్తర పూజలు, పుష్పాలతో అలంకరణ, స్వామి వారికి నివేదన, మంగళహారతులు, మంత్ర పుష్పం, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శిద్దా రాఘవరావు, శ్రీమతి శిద్దా లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు, శ్రీ అయ్యప్పస్వామి వారికి అభిషేకాలు నిర్వహించి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు శ్రీ అయ్యప్పస్వామి వారిని మంగళ వాయిద్యాల వేద మంత్రాలతో స్వామి వారిని అంతరాలయానికి చేర్చి విశేష పూజలు నిర్వహించి మహా హారతులు సమర్పించారు. శ్రీహరిహరక్షేత్రంలో అభిషేకాలు సందర్భంగా సకల దీక్షా స్వాముల అయ్యప్ప శరణు ఘోషలతో హరిహర క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది శిద్దా రాఘవరావు దంపతులు కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అట్టహాసంగా అయ్యప్పస్వామి నగరోత్సవం**

మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం వీనులవిందుగా,కమనీయంగా సాగింది.ఈ సందర్భంగా శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం పునస్కరించుకొని ఊరేగింపు రథాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు,విశేష పూలు,విద్యుత్ దీపాలతో స్వామి వారి రథం సర్వాంగ సుందరంగా అలంకరించారు. శిద్దా రాఘవరావు దంపతులు,టీటీడీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు శిద్దా కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించి నగరోత్సవం లాంఛనంగా ప్రారంభించారు.చిన్నారులు సాంప్రదాయ దుస్తులతో జ్యోతి ప్రదర్శన నగరోత్సవానికి ప్రత్యేక శోభను తెచ్చింది. సర్వ దీక్షా స్వాములు,గురు స్వాములు నగరోత్సవంలో పాల్గొని శ్రీఅయ్యప్పస్వామి భజనలు, కీర్తనలను భక్తిపారవశ్యం ఆలపించారు.మంగళ వాయిద్యాలు, కీర్తనలతో శ్రీఅయ్యప్పస్వామి నగరోత్సవం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో జరిగింది. చీమకుర్తి ప్రధాన రహదారి వెంట మహిళలు శ్రీ అయ్యప్పస్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి అయ్యప్పస్వామి హారతులు అందుకొన్నారు.

అయ్యప్పస్వామి నగరోత్సవంలో సర్వ దీక్షా స్వాములు, మహిళా భక్తులు,చీమకుర్తి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీ అయ్యప్పస్వామి నగరోత్సవం మాజీమంత్రి శిద్దా రాఘవరావు నివాసం వరకు సాగింది అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు కుటుంబ సభ్యులతో కలసి జ్యోతి ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు, భక్తులకు, స్వాములకు ప్రత్యేక ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, చీమకుర్తి పరిసర ప్రాంతాలను చెందిన సర్వ దీక్షా స్వాములు, వాసవి మహిళలు, చీమకుర్తికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో గుండ్లకమ్మ గేటు గల్లంతు

**ప్రాజెక్టును పరిశీలించిన రైతు, కౌలు రైతు సంఘాల బృందం**




ఒంగోలు, మేజర్‌న్యూస్ : మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు రిపేరు చేసి సాగర్ నుండి రెండు టీఎంసీల నీటితో ప్రాజెక్ట్ నింపాలని రైతు, కౌలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం ప్రాజెక్టును పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతు, కౌలు రైతు సంఘాల కార్యదర్శులు పమిడి వెంకట్రావు, వేసుపోగు బాలకోటయ్య మాట్లాడుతూ శుక్రవారం రాత్రి వరద నీరు ఉధృతికి మల్లవరం ప్రాజెక్టు రెండవ గేటు కొట్టుకుపోయింది. గత సంవత్సరం ఆగస్టులో మూడో నెంబర్ గేటు కొట్టుకుపోయింది, ఇప్పటి వరకు ఆ గేట్ రిపేరు పనులు పూర్తికాలేదు రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నడిచాయన్నారు. చివరకి రైతులు ప్రాజెక్ట్ వద్దకు పాదయాత్రలు కూడా చేశారు, అయినా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ పనులు పూర్తి కాలేదు అందువల్లనే నిన్న వరద నీరు ఉధృతికి రెండవ గేటు కొట్టక పోయిందన్నారు. దీనివల్ల రెండు టీఎంసీల నీరు సముద్రంలోకి వెళుతున్నాయి, అసలే కరువు జిల్లా త్రాగటానికి సాగుకు నీరు లేక అనేక ఇబ్బందులు పడతా ఉన్నామన్నారు. గేట్లు బాగా లేవని చెప్పి అధికారులు రిపోర్ట్ ఇచ్చినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ ఘటన జరిగింది అందువల్ల వెంటనే గేట్లు రిపేరు చేయించి సాగర్ నుంచి రెండు టీఎంసీల నీరు విడుదల చేసి మల్లవరం ప్రాజెక్టు నింపాలని రైతు ,కౌలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు, కౌలు రైతులు సంఘం నాయకులు మాబు, జయంతి బాబు, శ్రీకాంత్, ఉబ్బా ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# ఇది అసమర్థ ప్రభుత్వం

**ఏమాత్రం పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం**

**రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ధ్వజం**



బాపట్ల మేజర్‌న్యూస్: దుర్మార్గపూరితమైన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పార్టీ కార్యకర్తలు సంసిద్ధం కావాలని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపునిచ్చారు. వేల ఎకరాల్లో పంట పొలాలు తీవ్రంగా నష్టపోయి రైతులు అల్లాడుతుంటే ఈ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టలేదని ఆరోపించారు. ఈ అసమర్థ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పార్టీ శ్రేణులు కంకణ బదులు కావాలని అన్నారు. బాపట్లలో ఆయన సూర్య ప్రతినిధితో మాట్లాడారు.

# బ్యాడ్మింటన్ ఆశా కిరణాలు ఆషాశ్రీ, కావ్య శ్రీరాం




చీమకుర్తి, మేజర్‌న్యూస్:బాడ్మింటన్ పోటీల్లో జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన చిన్నారి దండు ఆషాశ్రీ భారత బ్యాడ్మింటన్‌లో ఆశా కిరణంగా వెలుగొందాలని టీటీడీ సభ్యులు, లార్డ్ కృష్ణ బాడ్మింటన్ అకాడమీ ఛైర్మన్ శిద్దా సుధీర్ కుమార్ ఆకాంక్షించారు. ఒంగోలు లార్డ్ కృష్ణ అకాడమీలో శిక్షణ పొందిన పదేళ్ల చిన్నారి దండు అషాశ్రీ , విజయవాడ లో శిక్షణ పొందిన కావ్య శ్రీరాం నవంబర్ 15 నుంచి 18 వరకు జాతీయ బాలికల డబుల్స్ బంగారు పతకం సాధించారు. అలాగే ఆషా శ్రీ బాలికల సింగిల్స్ లో రజిత పతకాన్ని సాధించింది. జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన ఆషాశ్రీ, కావ్య శ్రీరాంలను ఒంగోలులోని లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ కార్యాలయంలో శనివారం సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శిద్దా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పిన్న వయసులోనే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడమే కాకుండా అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. జన్మనిచ్చిన తలిధండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, పుట్టిన ఊరికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెస్తున్న చిన్నారిని మనస్పూర్తిగా ఆశీర్వదిస్తున్నానని చెప్పారు. క్రీడలతో పాటుగా చదువులో కూడా ఇదే పట్టుదల ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలోని బ్యాడ్మింటన్ క్రీడాకారులకు తమ అకాడమీ అండగా ఉంటుందని చెప్పారు. తాము స్థాపించిన లార్డ్ కృష్ణ బాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందిన అషా శ్రీ కలకత్తా లో జరిగిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందని అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి మురళీ కృష్ణ అన్నారు. తమ సంస్థలో 50 మంది పిల్లలు శిక్షణ పొందు, తున్నారని తెలిపారు. బాడ్మింటన్ క్రీడల్లో జాతీయ స్థాయి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ బీ.ఎన్. శశిధర్, ప్రముఖ న్యూరో సర్జన్ కేవి చంద్రశేఖర్ ఆషాశ్రీని అభినందించారు.

అనంతరం గోల్డ్ మెడల్ విజేత ఆషా శ్రీ , కావ్య శ్రీరాం లతో పాటుగా బాలుర డబుల్స్ విభాగంలో కే.సుహాస్, కోచ్ అమన్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సెక్రటరీ ఏ పద్మ ప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ. శశిధర్, ఎం. రఘుబాబు, డి. శ్రీనివాస్, ఏ. కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

# శ్రీగిరిలో 3వ అంతస్తు నిర్మాణ పనులకు శ్రీకారం



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో గోశాల అర్చకుల క్వార్టర్ 3వ అంతస్తు నిర్మాణ పనులను శనివారం ప్రారంభిం చారు. శ్రీగిరి వేద పండితులు పొదిలి భాను ప్రకాశ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, శ్రీగిరి ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులుసిబ్బంది, నీరజ ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో చంద్రబాబు భేటీ

ఒంగోలు, మేజర్‌న్యూస్: తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించేందుకు బాపట్ల జిల్లా వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, నియోజవర్గ ఇన్చార్జ్‌లతో భేటి అయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావం, నియోజకవర్గాల వారీగా పంట నష్టపోయిన వివరాలు, గత రాత్రి గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో గేటు ఊడిపోవడం, తాజా రాజకీయ పరిస్థితులపై నేతలతో చంద్రబాబు నాయుడు చర్చించారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



టంగుటూరు, మేజర్‌న్యూస్: సమీపంలోని టోల్ ప్లాజా దాటిన తర్వాత రొయ్యల ఫ్యాక్టరీ, తూర్పు నాయుడు పాలెం గ్రామాల మధ్య శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీరామ రంగారావు63 స్కూటీని లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం ఒంగోలు శ్రీనగర్ కాలనీకి చెందిన రంగారావు శనివారం ఉదయం స్కూటీపై బయలుదేరి సింగరాయకొండలోని తన బాబాయ్ కుమారుని సంవత్సరీకానికి హాజరై తిరిగి సాయంత్రం4 గంటల సమయంలో ఒంగోలు వెళ్ళుటకు బయలు దేరినట్లు తెలిపారు. బయలుదేరిన రంగారావు టోల్ ప్లాజా సమీపంలోని రొయ్యల ఫ్యాక్టరీ, తూర్పు నాయుడుపాలెం గ్రామాల మధ్యకు రాగానే వెనక నుండి ఆక్వా సంబంధించిన లారీ స్కూటీని ఢీకొట్టడంతో రంగా రావుకి బలమైన గాయాలు తగిలి తీవ్ర రక్త కాయాలు కావటంతో సంఘటనా స్థలంలోనే రంగారావు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందు కున్న స్థానిక ఎస్సై ఎస్.కె ఖాదర్ బాషా సంఘటన స్థలా న్ని పరిశీలించి ప్రమాదం జరిగిన విధానాన్ని అడిగి తెలు సుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై ఖాదర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ స్కీము ద్వారా ప్రజలకు ఎంతో మేలు



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: సెంట్రల్ గవర్నమెంట్ స్కీం ద్వారా పేద ప్రజలకు ఎంతో ఈ పథకాలు ప్రజలకు మేలు చేకూరుస్తుందని ఎంపీడీవో పి.రామకృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని పచ్చవ వద్దినేని వారి పాలెం గ్రామాలలో వికాసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నోడల్ అధికారి ఎం.అంజలీదేవి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సెంట్రల్ గవర్నమెంట్ స్కీమ్ ద్వారా గ్రామాల్లో ఉన్న ప్రజలకు గ్రామ అభివృద్ధికి 18 రకాల స్కీములు వచ్చినట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు వాటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. అయితే కొంతమందికి అర్హత ఉన్నప్పటికీ కోల్పోయిన లబ్ధిదారులు గ్రామాల్లో సచివాల పరిధిలో సంప్రదించి అర్జీ రూపంలో చేసుకోవచ్చన్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లో పంపిణీ ఈ స్కీం ద్వారా అందిస్తున్నట్టు గ్రామాల్లోని ప్రజలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల జేఏసి కన్వీనర్ టి.రామచంద్రయ్య, వైసీపీ నాయకులు బ్రహ్మయ్య, పంచాయతి కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

## శిద్ధా సుధీర్‌ని సన్మానించిన కాలేషా



దర్శి, మేజర్‌న్యూస్: తిరుమల, తిరుపతి పాలక మండలి సభ్యులు, యువ పారిశ్రామిక వేత్త, వైకాపా నాయకులు శిద్దా సుధీర్‌ని ఒంగోలుకు చెందిన కాలేషా ఘనంగా సన్మానించారు. సుధీర్‌ని ఆయన నివాసంలో ఒంగోలు గ్రాండ్ బెల్లం టీ యాజమాన్యం కాలేషా కలసి సన్మానించారు. ఆయనను పూల మాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. సుధీర్ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కాలేషా టీం ఆకాంక్షించారు.

# చంద్రబాబుని కలసిన టీడీపీ నేతలు



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు, ప్రకాశం జిల్లాలో దెబ్బ తిన్న పంటలు ను పరిశీలించడానికి రెండు రోజులు పాటు పర్యటిస్తున్నారు. అందులో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు నియోజకవర్గంలో చంద్రబాబు శనివారం దెబ్బతిన్న పంటలను శనివారం పరిశీలించారు. పర్చూరు నియోజకవర్గం పర్యటనలో ఉన్న చంద్రబాబుని మండల టిడిపి నేతలు కలిశారు. దర్శి నియోజకవర్గం లో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ముండ్లమూరులో అత్యధిక వర్ష పాతం నమోదు అయ్యిందని, ఇదురు గాలులు వర్షంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని చంద్రబాబు దృష్టికి మండల నాయకులు తీసుకెళ్లారు. మిరప సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. చంద్రబాబుని మాజీ యంపిపి మండలపు వెంకట రావు, శంకరా పురం సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, మాజీ యంపిటిసి జంపని శ్రీను, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## తీవ్ర వర్షం వలన దెబ్బతిన్న వరి



దర్శి, మేజర్‌న్యూస్: దర్శి నియోజకవర్గంలో తుఫాన్ కారణంగా రైతులు సాగు చేసిన పంటలు వర్షంతో దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను పాలకులు గాని, వ్యవసాయ అధికారులు గాని గ్రామాలలో సాగు చేసిన పరిశీలించిన దాఖలాలు లేవని రైతులు అంటున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యధిక వర్ష పాతం నియోజకవర్గంలో నమోదు అయ్యింది. నియోజకవర్గం పరిధిలో ఐదు మండలాలు పరిధిలో మిరపను అధికంగా సాగు చేశారు. వర్షం కారణంగా మిరప పంటలో వచ్చిన పూత, పిందె, కాయలు నేల రాలాయి. విపరీతంగా ఇదురు గాలులు వీయడంతో మిరప మొక్కలు నెల కొరిగాయి. కంది, వరి, మొక్కజొన్న, మినుము, బొబ్బర్లు, అరటి తోటలు ఉద్యాన పంటలు తూఫాన్ కారణంగా దెబ్బ తిన్నాయి. ఒక్క దర్శి నియోజకవర్గం పరిధిలోనే కోట్ల రూపాయలు మేర రైతులు నష్ట పోయారు. కనీసం పాలకులు దెబ్బ తిన్న పంటలను పరిశీలించిన దాఖలాలు లేవని అంటున్నారు. అధికారులు చేత నష్ట పరిహారం అంచనాలు వేసిన దాఖలాలు లేవని రైతులు అంటున్నారు. ఎన్నికల సమయంలో మాత్రం వాగ్దానాలు గుప్పిస్తారు కానీ రైతులు ఇబ్బందులు పడుతుంటే పాలకులు, అధికారులు పట్టించుకోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కార్తీక మాసంలో శివయ్యకు ఏకాదశి పూజలు



త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: స్వయంభుగా వెలసిన శ్రీ పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారికి కార్తీక మాసంలో ఏకాదశి రోజున ప్రత్యేకమైన పూజలు వైభవంగా జరిగాయి. ముఖ్యంగా దశమి ఏకాదశి పంచమి మాస శివరాత్రి శని త్రయోదశి ఇలాంటి రోజుల్లో భక్తులు సాంబశివునికి ఇష్టమైన పద్ధతులలో అభిషేకం పూజలు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా ఆవుపాలతో తేనెతో పంచామృతాలతో శివలింగానికి ముందుగా నీళ్లతో, కొబ్బరినీళ్ళతో, చెరుకు రసంతో పాటు పసుపు కుంకుమల కలిపిన నీళ్లతో అభిషేకం చేసిన అనంతరం ఆవుపాలతో స్వామివారికి ఎంతో భక్తిశ్రద్ధలతో వేద పండితులచే వేదమంత్రాలు పటించి భక్తులు గోత్రనామాలు అర్చకులు తెలియజేసి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు గోత్ర నామ పూజలు నిర్వహించి దర్శించుకుంటారు. స్వామివారికి ధూప దీప నైవేద్యం చెల్లించి సంతోషంగా పూజలు నిర్వహిస్తారు. అంతకుముందు ఆవు నెయ్యితో 365 వత్తులను ఒక మట్టి ప్రమిదలో పెట్టి దీపారాధన చేస్తుంటారు. ఈ క్రమంలోనే పూలమాలలు వేసి స్వామివారికి రుద్రాక్ష మాల వేసి స్వామికి ఇష్టమైన రీతిలో భక్తులు పూజలు నిర్వహిస్తారు. ఇదేవిధంగా శనివారం ఏకాదశి కావడంతో 13 జిల్లాల్లోని భక్తులు ఏకాదశి సందర్భంగా శ్రీ పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వం నారాయణ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు నుంచి ఆశీర్వదించారు. ఈ మాసంలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే శనివారం ఉభయ దేవాలయాల్లో కిక్కిరిసిన భక్తులతో ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.

# ఖాజీని తొలగించాలని తహశీల్దార్‌కు వినతి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో ప్రభుత్వ ఖాజీగా పని చేస్తున్న షేక్ నాయబ్ రసూల్‌ని తొలగించాలని గిద్దలూరు పట్టణంలోని అన్ని మసీదుల పెద్దలు మండలంలోని మసీదు పెద్దలు పెద్ద మసీదు నుండి ర్యాలీగా తాలూకా ఆఫీస్ వెళ్లి తహసిల్దార్‌కి వినతి పత్రం అందిస్తూ ఖాజీ నాయబ్ రసూల్ నికా పుస్తకాల కొరకు 4వేలు, 6వేలు, 7వేలు వసూలు చేస్తున్నాడని, అలాగే బీసీ ఈ కులం సర్టిఫికెట్ల కొరకు విద్యార్థులు, బీదవారు, విడో పర్సన్స్ దగ్గర నుండి 200 రూపాయల నుండి 500 రూపాయల వరకు వసూలు చేస్తున్నాడని, డబ్బులు ఇవ్వకపోతే సర్టిఫికెట్లు ఇవ్వడు. ప్రభుత్వ ఖాజీ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా నిర్వహిస్తూ ఉన్నాడు. ఇప్పటికైనా కలెక్టర్ వారు వెంటనే స్పందించి గిద్దలూరు హాజీ నాయబ్ రసూల్‌ని తొలగించమని రాష్ట్ర మైనారిటీ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక పంపి గిద్దలూరు మండల ముస్లిం ప్రజలను ఖాజీ బారి నుండి కాపాడాలని కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుడిసె మహబూబ్ బాషా, షేక్ మహబూబ్ హుస్సేన్, షేక్ మహబూబ్ పీరా, సేద అప్సర్ బాషా, పి.ఆదం ఖాన్, షేక్ దాదా, షేక్ గఫూర్, షేక్ ఖాదర్ వలీ, షేక్ సయ్యద్, షేక్ సలీం, షేక్ ఖాదర్బాషా, పి.మహబూబ్ ఖాన్, షేక్ సుకూర్, షేక్ వలి, షేక్ నన్నేవాలి, డి.దస్తగిరి, షేక్ వలి, షేక్ ఆశిక్, షేక్ రసూల్, షేక్ బాషా, షేక్ అలీ, అన్ని మసీదుల ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలో మిచౌంగ్ తూఫాన్‌తో దెబ్బతిన్న పంటలను వ్యవసాయా అధికారులు శనివారం పరిశీలించారు.

మండలంలోని కెల్లంపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగు చెసిన పంటలను పరిశీలించారు. రైతులు సాగు చేసి దెబ్బతిన్న శనగ, కంది, వరి పంటలను మండల వ్యవసా య అధికారి ఫరుక్ పరిశీలించారు. ఒక ఎకరాకి 25 కేజీలు కల్లు ఉప్పు ద్రావణాన్ని ఒక ఎకరా కు పిచికారీ చేయాలని, ఆవిధంగా చేస్తే విత్తనం మొలకెత్తి వని అన్నారు. పొలాల్లో ఉన్నా మురుగు నీటిని ఎప్పటికప్పుడు బయటకు ఏళ్ళ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## యువకుడిపై హత్యాయత్నం



సింగరాయకొండ, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని మూలగుంటపాడు కు చెందిన ఓ యువకుడిపై దాడి చేసి హత్యాయత్నం సంఘటన శనివారం సాయంత్రం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మూలగుంటపాడుకు చెందిన మిరియం శ్రీకాంత్ అనే యువకుడు స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో కూర్చుని ఉండగా పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు వెనకవైపు నుండి అకస్మాత్తుగా కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీకాంత్ గొంతు పైన తీవ్ర గాయం అయింది. పరిస్థితిని గమనించిన స్థానికులు శ్రీకాంత్ను 108 సహాయంతో వైద్యశాలకు తరలించారు. దాడి చేసిన యువకులు అక్కడినుండి తప్పించుకుని పరారీలో ఉన్నారు. సమాచారం అందుకున్న సింగరాయకొండ ఇన్చార్జ్ ఎస్సై వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. హత్యాయత్నం సమాచారం తెలుసుకున్న ఒంగోలు డిఎస్పి నారాయణస్వామి రెడ్డి ఈ కేసుపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. గతంలో సింగరాయకొండ జాతీయ రహదారిపై జరిగిన హత్యకు సంబంధిం చిన పాత కక్షలు నేపథ్యంలో శ్రీకాంత్‌పై హత్యాయత్నం జరిగిందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని నరసింగోలు గ్రామంలో వేరు చేసి ఉన్న రామలింగరూప శనీశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ అర్చకులు రామయ్య తెలిపారు. ఈ పూజల కొరకు వచ్చిన భక్తులందరికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులచే హెూమాలు, తిల తైలాభిషేకాలు, నవగ్రహ చుట్టూ ప్రదక్షిణ, శివాలయంలో దీపారాధన చేసినట్లు అర్చక తెలిపారు.

## బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పెన్షన్ రివిజన్ చేయాలి




ఒంగోలు, మేజర్‌న్యూస్: అఫిలియేటెడ్ ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ 20వ వార్షిక మహాసభ స్థానిక మల్లయ్య లింగం భవనంలో శుక్రవారం ఉదయం జరిగింది. ఈ మహాసభకు ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్కిల్ సెక్రటరీ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెన్షన్ రివిజన్ గురించి న్యూఢిల్లీ కేసులో అనుకూలమైన తీర్పు వచ్చినందున, కేంద్ర ప్రభుత్వం వెంటనే బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ తక్షణమే రివిజన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర సర్కిల్ ప్రెసిడెంట్ కె. ఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై జరుగుతున్న పోరాటంలో ప్రకాశం జిల్లా యూనియన్ నాయకులు సభ్యుల పాత్ర గణనీయమైనదని భవిష్యత్తులో ఇలానే సంఘటితంగా పోరాడమని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభకు సంబంధించి కార్యదర్శి నివేదికను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి బ్రహ్మానంద రెడ్డి, జమా ఖర్చులు వివరాలను కోశాధికారి పి తిరుపతి స్వామి సభకు సమర్పించారు. కే.అంజయ్య ఈసభకు కోఆర్డినేటర్ గా కే అంజయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో ఒంగోలు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ షేక్ అజీర్, అసోసియేషన్ వివిధ జిల్లాల కార్యదర్శులు రామ్మోహన్ రావు, సూర్య నారాయణ, షేక్ అబ్దుల్ రవూఫ్, తదితర నాయకులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం 20సంవత్సరాల క్రితం పదవీ విరమణ చేసిన బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ నూతన అధ్యక్షులుగా ఆర్ నాగేశ్వరరావు కార్యదర్శిగా బి.బ్రహ్మానందరెడ్డి, కోశాధికారిగా పి. తిరుపతి స్వామి, సహాయ కార్యదర్శిగా మిడసల మల్లికార్జునరావు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

## డిసీసీలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 76వ జన్మదినోత్సవ వేడుకలను ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ఈదా సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఈదా మాట్లాడుతూ సోనియా గాంధీ చేసిన త్యాగాలను కొనియాడారు. అధికారం కోసం వెంపర్లాడే ఈ రోజుల్లో ప్రధానమంత్రి పదవిని సైతం తీసుకోకుండా దెస ప్రయోజనాల కోసం ప్రపంచ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌ని రెండు సార్లు పది సంవత్సరాలు పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ప్రధానమంత్రిగా చేసిన ఘనత సోనియాకే దక్కిందన్నారు. వారి కుటుంబంలో ఇందిరాగాంధీ, సోనియా గాంధీ భర్త రాజీవ్ గాంధీ దారుణ హత్యకు గురైన కూడా బెదరకండ దేశ భద్రత కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి తన ఇద్దరు పిల్లలను కూడా ప్రజల్లోకి పంపి ప్రజాసేవకే అంకితం అవమని పంపించిన ఘనత సోనియా గాంధీకి దక్కుతుందన్నారు. దేశ భద్రత, అభివృద్ధి దృష్ట్యా కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకువచ్చి వారి కుటుంబ త్యాగాలకు సార్ధకత చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కో - చైర్మన్ ఉద్దండు మల్లికార్జున రావు, కొప్పోలు సుబ్బారావు, జిల్లా ఆర్గనైజింగ్ ప్రధానకార్యదర్శి దేవిరెడ్డి ఆదినారాయణరెడ్డి, మండల అధ్యక్షులు తెలగాలపూడి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి ప్రాజెక్టు కడితే, కొడుకు గేటు పెట్టలేక పోతున్నాడు

### మంత్రి అంబటిని పదవి నుండి తొలగించాలి - పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీరభద్రాచారి డిమాండ్

ఒంగోలు, మేజర్‌న్యూస్: గుండ్లకమ్మ గేటు గతంలో కొట్టుకుపోయి సంవత్సరం కావస్తున్నా, పట్టించుకోని కారణంగా ఇప్పుడు రెండవ గేటుకూడా కొట్టుకు పోయిన సంఘటన పరిసర గ్రామాల ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోందని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీర భద్రాచారి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంభందిత నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు, అధికారుల అసమర్ధతకు ముఖ్యమంత్రి జగన్మోహ నరెడ్డి కూడా భాధ్యత వహించ వలసి వస్తుందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్, తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో రెండేళ్ల కాల పరిధిలో సుమారు ఆరువందల కోట్ల రూపాయల వ్యయంతో రైతుల కోసం గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మిస్తే, ఆయన వారసుడుగా గొప్పలు చెప్పుకుని నేడు ముఖ్యమంత్రిగా ఉన్న



జగన్మోహనరెడ్డి మొదటి గేటు కొట్టుకు పోయి సంవత్సరం కావస్తున్నా గేటు పెట్టక పోగా, తన నిర్లక్ష్యం కారణంగా నేడు రెండవ గేటు కోల్పోయిన దౌర్భాగ్యం నేడు నెలకొందన్నారు. అధికారుల అవినీతికి అండగా ఉంటూ ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్న స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, తక్షణమే స్పందించాలని, లేనియెడల అనుమతి ఇస్తే రైతులే బిచ్చమేత్తుకుని గేటు నిర్మాణాలు చేపట్టుకుని ప్రాజెక్టును కాపాడుకుంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు దార్ల శ్రీను, పి.మధు, బ్రాహ్మణ పల్లి లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

# జీతాలందక గణపవరం పారిశుద్ధ్య కార్మికుల ఇక్కట్లు

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: గణపవరం గ్రామంలోని పారిశుధ్య కార్మికులు నెలల తరబడి గ్రామంలోని వీధుల్లో తడి పొడిచెత్తను గ్రామస్తులు తమ గృహాల్లోని పనికిరాని పేపర్లు ప్లాస్టిక్ వస్తువులు ఇంటిలోని దుమ్మును పారిశుధ్య కార్మికుల బండి ఇంటి ముందుకు రాగానే ఈ చెత్త చెదారం అంతా కవర్లో వేసి స్వచ్ఛ సంకల్పం అనే ఒక రిక్షా పారిశుద్ధ కార్మికులకు



విధుల్లోని చెత్తనంతా పారిశుధ్య కార్మికులు అందజేస్తుంటారు. నిత్యం దుర్గంతోపూరిత మైన దుర్వాసన వస్తున్న బ్రతుకుతెరువు కోసం పది మాసాలుగా ప్రజా ఆరోగ్యం కోసం నిత్యం పనిచేస్తున్న ఇంతవరకు గ్రామ పంచాయతీ నుండి పారిశుధ్య కార్మికులకు జీతాలు అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరూ అసహ్యించుకుంటున్న గ్రామంలో స్వచ్ఛ సంకల్పం పేరుతో గ్రామపంచాయతీ వారు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వీధుల్లోని మురుగు కాలువలో మురుగునీటి అంత చేతులతో తోడటం దుర్వాసన వేస్తున్న మట్టిని పెంటకుప్పలను కూడా పారిశుద్ధ కార్మికులు తొలగిస్తున్నారు ఇలాంటి పనిచేసేందుకు ఎవరు ముందుకు రాకున్నప్పటికి ప్రజల ఆరోగ్యం కోసం తమ జీవన మృతి కోసం ఇలాంటి పని చేస్తున్న తమ పై అధికారులు మా జీవన స్థితిగతులను చూసి పది మాసాలు అవుతున్న ఇంతవరకు జీతాలు ఇవ్వలేదని మా బ్రతుకులు ఎలా గడపాలని గణపవరం పారిశుద్ధ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరికీ పండుగ రోజు వచ్చిన సంతోషంగా ఇంటి దగ్గర ఉండి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పండుగ చేసుకుని సంతోషంగా ఉంటారు. కానీ వీధుల్లో చెత్తాచెదారం ఏరేసి జీతం అందక ఆర్థిక ఇబ్బందులతోటి పండుగ ఎలా చేసుకుంటామని వాపోతున్నారు గణపవరం గ్రామంలో నలుగురు పారిశుద్ధ కార్మికులు నిత్యం నిద్రలేవగానే వీధుల్లోని చెత్తాచెదారాన్ని తొలగించడమే కాకుండా ప్రతి ఇంటి ముందుకు వచ్చి ఒక విజిల్ వేసి ఆ ఇంట్లో వారు కవర్లో వేసిన మలినమైన పదార్థాలను తాము ప్రజా ఆరోగ్య కంటే తమ ఆరోగ్యము ముఖ్యం కాదని ఎవరు చేసే పని వారు చేయాలని అందుకుతాము పనిచేస్తున్న మండల స్థాయి అధికారులు సచివాలయ అధికారులు నిత్యం చేస్తున్న పని చూస్తున్నారు. తప్ప జీతాలు ఇవ్వకపోతే తమ కుటుంబాలు ఎలా జీవనం సాగిస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ ఆవేదనను బాధను అర్థం చేసుకొని క్రిస్టమస్ నాటికి జీతాలు అందిస్తే తాము కూడా అందరిలాగే పండుగ చేసుకుంటామని అందుకు పంచాయతీ అధికారులు సచివాలయ అధికారులు మండల అధికారులు తమ విన్నపాన్ని మన్నించి జీతాలు అందివ్వాలని పారిశుధ్య కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# యాభై ఏళ్ళ తర్వాత అపూర్వ కలయిక







### పూర్వ విద్యార్థులకు ఆశీర్వదించిన పూర్వ గురువులు

ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రముఖయోగ శ్రీ పతాంజలి శ్రీనివాస్, అయినా బత్తిన ఘనశ్యాం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1973 ఒకటవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక సెయింట్ జేవియర్స్ ఉన్నత పాఠశాలలో 1973 ఒకటో తరగతి నుండి చదివిన విద్యార్థిని విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా పూర్వ గురువులు శ్రీశారద, శ్ర అనంతలక్ష్మిలను హైదరాబాద్ నగరం నుండి విచ్చేసి విద్యార్థినీ విద్యార్థులను ఆశీర్వదించారు. వారు 50 సంవత్సరాల తర్వాత విద్యార్థిని విద్యార్థులు ఈ విధంగా కలవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలియజేశారు. ఇదొక భగవంతుని ఆశీస్సులు ఇన్ని సంవత్సరాల తర్వాత కలవడం అద్భుతంగా ఆశ్చర్యంగా ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ అయిన బత్తిన ఘన శ్యామ్, డాక్టర్ రమేష్, జాయింట్ డైరెక్టర్ టిబి హెల్త్ జనరల్ మేనేజర్ నామా సుబ్బారావు, సీఈవో వర్మి కంపెనీ మధు శేష చారి, కోటేశ్వరరావు, రావులపల్లి వెంకటేశ్వర్లు, వరికోటి ఆంజనేయులు, పున్నమరాజు 50మంది వరకు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచానికి ఆదర్శంగా మోడీ పథకాలు

### బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్యయాదవ్

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రపంచానికి ఆదర్శంగా మోడీ పథకాలు నిలచాలని బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ అన్నారు. వికజిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఒంగోలు మండల పరిధిలోని కరవది, చేజర్లలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్న సభలో బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు అయిందన్నారు. అధిక శాతం కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉండి అనేక కుంభకోణాలు పాల్పడి దేశాన్ని నాశనం చేసిందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత ఒక్క నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వము మాత్రమే అవినీతి రహిత పరిపాలన దేశ ప్రజలకు అందిస్తుందన్నారు. పేద, బడుగు బలహీనర్గాలప్రజలు మోడీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వినియోగించు కొనాలని పిలుపునిచ్చారు.




ఈ కార్యక్రమంలో సెగ్గేం శ్రీనివాసరావు, మిరియం శ్రీనివాసరావు యాదవ్, శివాజి యాదవ్, దామోదర్, ఆంజనేయులు, తిరుమల, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.